ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రాజన్న సిరిసిల్ల
జిల్లా వార్తలు
సోమవారం 22 సెప్టెంబరు 2025



అమ్మో అమెరికానా..!



- కూలుతున్న డాలర్ డ్రీమ్స్
- ట్రంప్ ఆంక్షలపై కుటుంబ సభ్యుల ఆందోళనలు
- హెచ్1బీ నిబంధనలతో చదువులు, ఉద్యోగాలపై ప్రభావం
- నిత్యం పార్ట్‌టైం ఉద్యోగంపై కలవరమే
- తల్లిదండ్రుల్లో గుబులు..

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

ఉన్నత చదువులు, ఉపాధి, మెరుగైన జీవితం కోసం రాజన్న సిరిసిల్ల జిల్లా నుంచి వేల సంఖ్యలో అగ్రరాజ్యం అమెరికాకు అనేక సంవత్సరాలుగా వెళ్తున్నారు. ఇటీవల వెళ్లిన వారిలో కొంతమంది మాత్రమే తమ లక్ష్యాలను చేరుకున్నారు. అనేకమంది యువతి, యువకులు అక్కడే ఉద్యోగాలు చేసుకుంటూ స్థిరపడాలనుకునే వారి ఆశలు కూలిపోతున్నాయి. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ దేశ పగ్గాలు చేపట్టిన తర్వాత ఇతర దేశాల నుంచి వచ్చి ఉంటున్న వారిపై అనేక ఆంక్షలు పెడుతున్నాడు. ముఖ్యంగా భారతీయుల విషయంలో ఆంక్షలు పెరుగుతుండడంతో రాజన్నసిరిసిల్ల జిల్లాలోని వారి కుటుంబ సభ్యులు కలవరపడుతున్నారు. తాజాగా ట్రంప్ హెచ్‌వన్‌బీ వీసాలపై పెట్టిన ఆంక్షలతో జిల్లాలోని ఎన్నారైలు, ఎమ్మెస్ చదువులకోసం వెళ్లిన విద్యార్థుల తల్లిదండ్రుల్లో ఆలజడి మొదలైంది. అమెరికా యూనివర్సిటీలో జిల్లాకు చెందిన యువత ఐటీతో పాటు ఇతర రంగాల్లో ఓపీటీ, స్టెమ్ ఓపీటీల అనంతరం అమెరికా కంపెనీల్లో ఉద్యోగాలు సాధించారు. ఆ తర్వాత హెచ్1బీ వీసాలు కూడా పొందారు. కొందరు గ్రీన్‌కార్డును సైతం సొంతం చేసుకున్నారు. జిల్లా నుంచి పదివేల మంది విద్యార్థులు ఎన్నారైలుగా ఉన్నారు. ట్రంప్ అధికారంలోకి వచ్చిన తర్వాత స్టెమ్ ఓపీటీల కోసం ఎదురుచూసే పరిస్థితి ఏర్పడింది. దీనికి తోడుగా హెచ్1బీ వీసాకు ప్రతిఏటా రూ 90లక్షల వరకు కంపెనీలు చెల్లించాలని నిబంధన పెట్టడంతో ఉద్యోగాలపై ప్రభావం పడింది. అమెరికాలోని మైక్రోసాఫ్ట్, అమెజాన్, గూగుల్, ఆపిల్‌తో పాటు అనేక అంతర్జాతీయ ఐటీ కంపెనీలు అమెరికాను వీడి ఎవరు వెళ్లవద్దని, ఎవరైనా విదేశాలకు వెళ్లి ఉంటే వెంటనే రావాలని ఆదేశాలు ఇచ్చాయి. హెచ్1బీ వీసా అనుమతికి, రెన్యువల్ రూ లక్షడాలర్ల వరకు చెల్లించాల్సినా ఆంక్షలు మధ్యతరగతి కుటుంబాల్లో ఆందోళనలు ఏర్పడ్డాయి

● చెదురుతున్న విదేశీ కలలు

అమెరికాలాంటి సంపన్న దేశాలకు వెళ్లే విదేశీకలలు చెదిరిపోతున్నాయి. 'మా అబ్బాయి, అమ్మాయి ఎమ్మెస్సీ కోసం అమెరికాకు పంపించాము... చదువు పూర్తిచేసుకుని ఉద్యోగం చేస్తున్నారు... అమెరికా సంబంధమే చూసి పెళ్లిచేశాం... బిడ్డ అమెరికా సిటిజన్' అంటూ గర్వంగా చెప్పుకున్న సందర్భాలు జిల్లాలో ఉన్నాయి. అలాగే 'బిడ్డ అల్లుడు అందరూ అక్కడే.. మేము వెళ్లొచ్చాం..' అని గొప్పగా చెప్పుకోవడం చూశాం. దీనిని చూసి తమ పిల్లల్ని కూడా అదే బాటలో పంపించారు. పిల్లలు మంచి జీవితాన్ని పొందుతారని ఉన్నత, మధ్యతరగతి వర్గాలతోనే కాకుండా కుటుంబాల పిల్లలు,

- మిగతా 8లో

ట్రంప్ నిబంధనలు భయపెడుతున్నాయి..



ఇద్దరు కొడుకులు అమెరికాలో ఉన్నారు. పెద్దకొడుకు ఉద్యోగం వచ్చింది. రెండో కొడుకు రెండు సంవత్సరాల నుంచి ఉద్యోగం కోసం చూస్తున్నారు. ట్రంప్ పెడుతున్న ఇబ్బందులు భయపెడుతున్నాయి. పాత పద్ధతులు ఉంటే బాగుండు.

- ఎల్లాల వినోద, మంగళపల్లి

భారత ప్రభుత్వం జోక్యం చేసుకోవాలి..



అమెరికా అధ్యక్షుడు హెచ్1బీ వీసాపై తీసుకున్న నిర్ణయం విద్యార్థులకు శాపంగా మారుతోంది. నా కొడుకు రెండు సంవత్సరాల క్రితం అమెరికాకు వెళ్లాడు. 40 లక్షల వరకు ఖర్చు అయింది. చదువు పూర్తయినా ఉద్యోగం రాలేదు. హెచ్1బీ వీసా వార్షిక దరఖాస్తుకు లక్ష డాలర్లు పెట్టడం విద్యార్థులపై ప్రభావం చూపుతోంది. భారత ప్రభుత్వం జోక్యం చేసుకొని అమెరికాకు వెళ్లిన విద్యార్థులకు భరోసానివ్వాలి.

- కేతిరెడ్డి శరత్‌రెడ్డి పెద్దలింగాపూర్

శుభప్రదం.. అమ్మవారి దర్శనం..

- నేటి నుంచి శరన్నవరాత్రులు
- ప్రత్యేక అలంకరణలతో మండపాల ఏర్పాటు
- రోజుకో అవతారంలో అమ్మవారు..


మండపంలో అమ్మవారు(ఫైల్)

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

శరన్నవరాత్రులు వచ్చేశాయి. భక్తులు అమ్మవారిని తమకిష్టమైన తొమ్మిది అవతారాల్లో అలంకరణలతో కొలుచుకుంటారు.ఇందుకోసం రాజన్న సిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా శరన్నవరాత్రులు అత్యంత ఘనంగా జరుపుకోవడానికి ఏర్పాట్లు చేశారు. జిల్లా కేంద్రంలో మండపాలను అలంకరించారు. వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి దేవస్థానంలో దేవినవరాత్రులు వైభవంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. సోమవారం ప్రారంభమయ్యే శర్నవరాత్రులు విజయదశమితో ముగియనున్నాయి. దసరా సరదాలే కాదు చైతన్యాన్ని కలిగించే పండుగ. హిందువులకు పండుగల్లో అతి ముఖ్యమైనదిగా తొమ్మిది రోజుల పాటు దేవి శరన్నవరాత్రులుగా కొలుచుకుంటారు. ఈ పండుగలో మొదటి మూడు రోజులు పార్వతీదేవికి, తర్వాత మూడురోజులు లక్ష్మీ దేవికి, ఆ తరువాత మూడు రోజులు సరస్వతికి పూజలు నిర్వహిస్తారు. తొమ్మిది రోజుల్లో అమ్మవారిని తొమ్మిది రూపాల్లో అలంకరించుకొని పూజలు చేస్తారు.

నవదుర్గలుగా రాజరాజేశ్వరీ అమ్మవారు...

రాజన్న సిరిసిల్ల జిల్లాలో పల్లెలు, పట్టణాలతోపాటు వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వరస్వామి సన్నిధిలో శరన్నవరాత్రుల్లో శ్రీరాజరాజేశ్వరి అమ్మవారు నవదుర్గల రూపంలో భక్తులకు దర్శనమిస్తారు. తొలిరోజు 22వ తేదిన శైలపుత్రిగా, రెండవ రోజు 23న బ్రహ్మచారిణిగా, మూడవ రోజు 24న చంద్రఘంట రూపంలో, నాల్గవ రోజు 25న కూష్మాండ అవతారంలో, ఐదవరోజు 26న కూష్మాండ అవతారంలో, ఆరవ రోజు27న స్కందమాత రూపంలో, ఏడవ రోజు 28న కాత్యాయనిగా, ఎనిమిదవ రోజు 29న కాళరాత్రి రూపంలో, తొమ్మిదవ రోజు 30న దుర్గాష్టమి మహాగౌరీ అలంకారం అమ్మవారు దర్శనమిస్తారు. పదవరోజు అక్టోబర్ 1న సిద్ధిదా అలంకారంలో, పదకొండవ రోజు 2న దసరా రోజున మహాలక్ష్మిగా పూజలందుకుంటారు. అమ్మవారి రూపాలైన మహాకాళీ, మహాలక్ష్మీ, మహాసరస్వతి, బాలాత్రిపురసుందరీదేవి, రాజరాజేశ్వరీ అమ్మవార్లలో ఒకరైన రాజరాజేశ్వరి అమ్మవారు కొలువై ఉన్న క్షేత్రం కావడంతో శ్రీశరన్నవరాత్రి ఉత్సవాలకు ప్రత్యేకతగా భావిస్తారు. మరోవైపు బ్రాహ్మి, మాహేశ్వరి, కౌమారి, వైష్ణవి, వారాహి, ఇంద్రాణి, చాముండ సప్తమాతృకలలోని వారాహి రూపం కూడా అమ్మవారిలో నిక్షిప్తమై ఉన్నది. ఆలయ ఆవరణలోనే బాలాత్రిపురసుందరీదేవి, ఆలయం వెనుకవైపు మహిషాసురమర్దినీ అమ్మవారు కొలువై ఉన్నారు. దీంతో దుర్గాష్టమి రోజున మహిషాసురమర్దినీ అమ్మవారికి మహాపూజ నిర్వహిస్తారు.

ఊరురా పూలజాతర..

- ● జిల్లాలో సంబరంగా బతుకమ్మ వేడుకలు షురూ ● సిరిసిల్ల బతుకమ్మ ఘాట్ వద్ద సందడి


సిరిసిల్ల మానేరు తీరంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు..


సిరిసిల్ల పట్టణంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు..


బతుకమ్మలను తీసుకెళుతున్న మహిళలు

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

సంస్కృతి సంప్రదాయలు ఉట్టిపడేలా ఆడపడుచులు అత్యంత ఇష్టంగా జరుపుకునే బతుకమ్మ పండుగతో ఊరురా పూల జాతర మొదలైంది. బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో బంగారు బతుకమ్మ ఉయ్యాలో అంటూ ఆదివారం సాయంత్రం రాజన్న సిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా బతుకమ్మ సంబురాలు ఎంతో సందడిగా ప్రారంభమయ్యాయి. తొమ్మిది రోజుల పాటు కొనసాగే బతుకమ్మ పర్వం తొలిరోజు పూల పరిమళాలతో ఆడపడుచులు సందడి చేశారు. ప్రతి పల్లె నుంచి పట్టణందాకా ప్రతి గల్లీలోనూ మహిళల చప్పట్లు, గొంతుకల ఐక్యత బతుకమ్మ పాటలు గానంచేశాయి. జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీలతో పాటు మండల కేంద్రాలు, గ్రామాల్లో తీరొక్క పూలతో పేర్చిన బతుకమ్మలతో ఆటపాటల వేడుకలు నేత్రపర్వంగా సాగాయి. జిల్లా కేంద్రంలోని మానేరు తీరంలో తెలంగాణలోనే ప్రత్యేకంగా నిలిచిన బతుకమ్మ ఘాట్ వద్ద పురపాలకర సంఘం ఏర్పాటు చేసిన ప్రత్యేక ఏర్పాట్లు మహిళలను ఆకట్టుకున్నాయి. సిరిసిల్లలోని బీవైనగర్, గణేష్‌నగర్, తారకరామానగర్, వెంకంపేట, సర్దార్‌నగర్, అశోక్‌నగర్, పద్మనగర్, సంజీవయ్యనగర్, శాంతినగర్, అటోనగర్, సిద్ధార్థనగర్, రెడ్డివాడ, అంబేద్కర్‌నగర్, విద్యానగర్, సాయినగర్, గీతానగర్, శివనగర్, సుభాష్‌నగర్, నెహ్రూనగర్, గాంధీనగర్, గోపాల్‌నగర్, పెద్దబజార్, తదితర ప్రాంతాల్లో మహిళలు సామూహికంగా బతుకమ్మ ఆట పాటలతో సంబురంగా గడిపారు.

దసరాకు ఉరికెళ్తున్నారా.. జాగ్రత్త..!

- గ్రామాల్లో, పట్టణాల్లో ముమ్మర పెట్రోలింగ్..
- అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే సమాచారం అందించాలి
- ఎస్పీ మహేష్ బి.గితే

సిరిసిల్ల క్రైం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): దసరా పండుగ సెలవులను పురస్కరించుకొని సొంత ప్రాంతాలకు, బంధువుల ఇళ్లకు, విహారయాత్రలకు వెళ్లేవారు జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్పీ మహేష్ బీ గితే తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఆయాగ్రామాల, పట్టణాల కాలనీ, ఆపార్టుమెంట్ వాసులు దొంగతనాలపై అప్రమత్తంగా ఉండాలని, ఇందుకు తగిన ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. దసరా పండుగ సందర్భంగా చోరీల నియంత్రణకు గ్రామాల్లో, పట్టణాల్లో ముమ్మర పెట్రోలింగ్ చేస్తున్నామన్నారు. ప్రజలు పోలీస్ శాఖ సలహాలు, సూచనలు పాటిస్తూ సహకరించాలని పేర్కొన్నారు. సెలవుల్లో బయటికి వెళుతున్నప్పుడు మీ ఇంటికి సెంట్రల్ లాక్ సిస్టమ్ ఉండే తాళం, సెక్యూరిటీ అలారం, మోషన్ సెన్సర్లు ఏర్పాటు చేసుకోవడం మంచిదన్నారు. తాళం వేసి ఊరికి వెళ్లాల్సి వస్తే తప్పనిసరి స్థానిక పోలీస్ స్టేషన్‌లో లేదా గ్రామ పోలీస్ అధికారికి సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ మేరకు వివరాలు నమోదు చేసుకొని వారి ఇళ్లపై నిఘా ఏర్పాటు చేస్తామన్నారు. ఊరికి వెళ్లాల్సి వస్తే విలువైన బంగారు, వెండి, ఆభరణాలు, డబ్బులు, బ్యాంక్ లాకర్లలో భద్రపర్చుకోవాలన్నారు. పక్కింటి వారికి, తెలిసిన వారికి ఇచ్చి మోసపోవద్దన్నారు. వాహనాలను ఇంటి ఆవరణలోనే పార్కుచేసుకోవాలని, ద్విచక్ర వాహనాలకు తప్పనిసరిగా చైన్స్‌తో లాక్ వెయ్యడం మంచిదన్నారు. నమ్మకమైన వ్యక్తులను మాత్రమే వాచ్‌మెన్, సెక్యూరిటీ గార్డ్స్, సర్వెంట్‌గా నియమించుకోవాలన్నారు. సోషల్ మీడియాలో మీ లొకేషన్, ట్రావెల్స్ ప్లాన్స్, ఎప్పుడు ఎక్కడికి వెళ్తున్నాం అనే మీ అప్డేట్స్ పెట్టవద్దన్నారు. మీ ఇంట్లో స్వీయ రక్షణ సీసీ కెమెరాలను అమర్చుకోవాలన్నారు. ఆన్‌లైన్లో ఎప్పటికప్పుడు మొబైల్‌లో మీ ఇంటిని, పరిసరాలను ప్రత్యేక్షంగా చూసుకోవచ్చన్నారు. సెక్యూరిటీ సర్వేలైన్స్‌కు సీసీ కెమెరాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. ఊరు వెళ్తున్నప్పుడు పక్కింటి వారికి ఇంటి పరిసరాలను గమనించాలని చెప్పాలన్నారు. ఇంటికి తాళం వేసిన తర్వాత తాళం కనబడకుండా డోర్ కర్టెన్ వేయాలన్నారు. ఇంట్లో ఏదో ఒక గదిలో లైట్ వేసి ఉంచాలన్నారు. ఇంట్లో లేనప్పుడు పని మనుషులు ఉంటే రోజు వాకిలి ఊడ్చమని చెప్పాలని, ఇంటి ముందు చెత్త చెదారం, న్యూస్ పేపర్స్ పాలప్యాకెట్లు జమ కానివ్వకుండా చూడాలన్నారు. వాటిని కూడా గమనించి నేరస్థులు దొంగతనాలకు పాల్పడే అవకాశం ఉన్నదన్నారు. మీ గ్రామం, పట్టణం, కాలనీలో ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే స్థానిక పోలీసు స్టేషన్‌కు తప్పనిసరిగా సమాచారం ఇవ్వాలని, డయల్ 100కు కాల్ చేయాలని ఎస్పీ పేర్కొన్నారు. ప్రజలు పోలీస్ శాఖ వారి సూచనలు పాటిస్తూ సహకరిస్తే చోరీల నియంత్రించడం సులభం అవుతుందని ఎస్పీ తెలిపారు.

బతుకమ్మ పండుగపూట పల్లెలు కళతప్పాయి..

- జడ్పీ మాజీ వైస్‌చైర్మన్ సిద్దం వేణు


సమావేశంలో మాట్లాడుతున్న వేణు

ఇల్లంతకుంట, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి) :రాష్ట్రప్రభుత్వం పట్టించుకోకపోవడం వల్ల బతుకమ్మ పండుగపూట గ్రామాలు కళతప్పిపోయాయని జడ్పీమాజీ వైస్‌చైర్మన్ సిద్దం వేణు పేర్కొన్నారు. మండలకేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మహిళలు అత్యంత వైభవంగా జరుపుకునే బతుకమ్మ పండుగకు ప్రభుత్వం ఏమాత్రం ఏర్పాట్లు చేయకపోవడం మహిళలను అవమానించడమే అన్నారు. గ్రామాలలో కనీసం విద్యుత్ దీపాలు వెలగడం లేదన్నారు. పారిశుధ్యకార్మికులు, ఫీల్డ్‌అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు పండుగపూట పస్తులుండే పరిస్థితులు రాష్ట్రంలో నెలకొన్నవని విమర్శించారు. సమస్యలు తీర్చవలసిన ప్రభుత్వం డైవర్షన్ పాలిటిక్స్ చేస్తుందన్నారు. రాష్ట్రంలో అనేక సమస్యలు నెలకొన్న వాటిని పరిష్కరించే పరిస్థితి లేకుండా పోయిందన్నారు. కాంగ్రెస్‌పార్టీకి ఎందుకు ఓటువేశామని ప్రజలు బాధపడుతున్నారని పేర్కొన్నారు. రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పడానికి ప్రజలు సిద్ధం అవుతున్నారని పేర్కొన్నారు. సమావేశంలో నాయకులు సావనపెల్లి అనీల్‌కుమార్, ఎద్దు కుమార్, మీసరగండ్ల అనీల్‌కుమార్, కూనబోయిన రఘు, కెశవేని శ్రీనివాస్, బర్ల రమేష్, గుంటి మధు తదితరులు పాల్గొన్నారు.

శివకేశవస్వామి కల్యాణ మహోత్సవానికి ఏర్పాట్లు పూర్తి


హోమగుండం ఏర్పాటు చేస్తున్న భక్తులు

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల బొప్పాపూర్ శివకేశవస్వామి ఆలయాన్ని ఆధునీకరించి స్వామివారి కల్యాణ మహోత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఆలయ భక్త బృందం కమిటీ సభ్యులు ఆదివారం పేర్కొన్నారు. ఆలయ ప్రాంగణంలో ఆంజనేయస్వామి, శిఖర, సంతాన నాగేంద్ర, నవగ్రహ సహిత, గరుడదధ్వజ, ప్రాణ ప్రతిష్ఠ ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించనున్నామని తెలిపారు. అర్చకులు రాచర్ల విశ్వనాథశర్మ, రాచర్ల శ్రీనివాస్‌శర్మ, కొండపాక శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో ఈనెల 22న వేదపండితుల ఆధ్వర్యంలో ఉదయం మహాగణపతి పూజ, అఖండ దీపారాధన, యాగశాల ప్రవేశం, అగ్నిప్రతిష్ఠ, గణపతిహోమం, జల దివాసం, ఈనెల 23న దేవతాహవనం, పుష్పదివాసం, ప్రదోషకాల పూజ, 24న శివకేశవస్వామి ఆలయ శిఖరంపై కుంబాభిషేకం, యంత్ర ప్రతిష్ఠ, ప్రాణప్రతిష్ఠ తదితర కార్యక్రమాలు జరుగనున్నాయని చెప్పారు. ఉదయం 10.30 గంటలకు స్వామి కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని పేర్కొన్నారు. అనంతరం అన్నదానం చేపట్టనున్నామని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో తరలిరావాలని భక్త బృందం కమిటీ సభ్యులు కోరారు.

జ్యోతిబా పూలే ఆశయాల సాధనకు కృషి

- మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ - పెద్దలింగాపూర్‌లో విగ్రహాల ఆవిష్కరణ


జ్యోతిబాపూలే, సావిత్రీబాయిపూలే విగ్రహాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఇల్లంతకుంట, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : జ్యోతిబా పూలే ఆశయాల సాధనకు కృషి చేయాలని మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, ముదిరాజ్ సంఘ నాయకుడు అంబరిపేట శంకర్‌లు పేర్కొన్నారు. మండలంలోని పెద్దలింగాపూర్ గ్రామంలో ఆదివారం జ్యోతిబా పూలే, సావిత్రీబాయి పూలే, పండుగ సాయన్న విగ్రహాలను ఆవిష్కరించారు. ముదిరాజ్ సంఘ అధ్యక్షుడు ఏలవేని రమేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాట్లాడుతూ బడుగు, బలహీనవర్గాల అభివృద్ధి కోసం నిరంతరం పోరాటం చేసిన ఘనత జ్యోతిబా పూలేకు దక్కుతుందన్నారు. తొలిమహిళా ఉపాధ్యాయురాలిగా సావిత్రీబాయి పూలే మహిళల చదువుకోసం చేసిన కృషి ఎల్లప్పటికి గుర్తు ఉంటుందన్నారు. మహనీయుల చరిత్రను ప్రతి ఒక్కరు తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. నిజాం పరిపాలనలో రజాకార్లకు వ్యతిరేకంగా ఉద్యమించిన నాయకుడు పండుగు సాయన్న అని అన్నారు. గ్రామంలో విగ్రహాల ఏర్పాటుకు దాతలు ముందుకురావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకుడు నీలం శ్రీనివాస్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి, ముదిరాజ్ సంఘ జిల్లా అధ్యక్షుడు చొక్కాల రాము, మండల శాఖ అధ్యక్షుడు ఏలవేని రమేష్, జిల్లా మత్స్యపారిశ్రామిక సహకార సంఘ అధ్యక్షుడు చొప్పరి రామచంద్రం, జడ్పీ మాజీ వైస్‌చైర్మన్ సిద్దం వేణు, మాజీ సర్పంచ్‌లు కేతిరెడ్డి మంజుల, గొడిశెల జితేందర్‌గౌడ్, మాజీ ఎంపీటీసీ కరివెద స్వప్న, బీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కొమ్ము రమేష్, నాయకులు కొమ్ముల ఎల్లయ్య, కరుణాల భద్రాచలం, కేతిరెడ్డి నవీన్‌రెడ్డి, రేగుల బిక్షపతి, కొమ్ముల లచ్చయ్య, భగవాన్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ కౌన్సిలర్ హంతకులను కఠినంగా శిక్షించాలి

- దళిత సంఘాల నాయకులు


మాట్లాడుతున్న దళిత సంఘాల నాయకులు

సిరిసిల్ల టౌన్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల మున్సిపల్ మాజీ కౌన్సిలర్, దళిత నాయకుడు సిరిగిరి రమేష్ హత్య వెనకాల ఉన్న దోషులను శిక్షించాలని దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రమేష్‌ను సుపారీ ఇచ్చి హత్య చేసినట్లు పలు అనుమానాలు వ్యక్తంచేశారు. రమేష్‌ను ఎక్కడో హత్య చేసి వేములవాడ నంది కమాన్ వద్ద వదిలి వెళ్లారని అనుమానాలున్నాయన్నారు. భూవివాదాలపై విచారణ చేపట్టి హత్యకు గురైన రమేష్ కాల్ డేటా ద్వారా దోషులను గుర్తించి శిక్షించాలన్నారు. రమేష్ కుటుంబానికి పోలీసులు రక్షణ కల్పించాలన్నారు. ఈ సమావేశంలో దళిత సంఘాల నాయకులు రాగుల రాములు, ఆకునూరి బాలరాజు,నాలుక సత్యం తదితరులు ఉన్నారు.

బతుకమ్మ వేడుకలను విజయవంతం చేయాలి

సిరిసిల్ల టౌన్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం సిరిసిల్ల బతుకమ్మ ఘాట్ వద్ద బతుకమ్మ వేడుకలను విజయవంతంచేయాలని పార్టీ మహిళా విభాగం పట్టణ అధ్యక్షురాలు బత్తుల వనజరమేష్ అన్నారు. ఆదివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణితో కలిసి బీఆర్‌ఎస్ మహిళ పట్టణ అధ్యక్షురాలు వనజరమేష్‌తో మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉండగా 18 ఏళ్ల నిండిన ప్రతి మహిళకు బతుకమ్మ, దసరా కానుకగా బతుకమ్మ చీరలను ఇచ్చిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు కావస్తున్న చీరలు ఇవ్వలేదని ఆరోపించారు. స్వశక్తి సంఘంలో ఉన్న మహిళలకే చీరలు ఇస్తామనడం సరికాదన్నారు. తెలంగాణ ఆడబిడ్డలందరికి చీరలను ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్ పట్టణ మహిళా కమిటి ఆధ్వర్యంలో సోమవారం నాలుగ గంటలకు సిరిసిల్ల పట్టణం బతుకమ్మ ఘాట్ వద్ద నిర్వహిస్తున్న బతుకమ్మ వేడుకలకు పట్టణంలో ఉన్న మహిళలు, పార్టీ మహిళా కార్యకర్తలు, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నాలని కోరారు. ఈ సమావేశంలో మాజీ జడ్పీటీసీ గుగులోతు రేణా, చేరాల స్వాతి, వద్దూరి లక్ష్మి పాల్గొన్నారు.

వేములవాడలో ఎంగిలి పూల వైభవం...


రాజన్న ఆలయంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు


ధర్మగుండంలో బతుకమ్మలు నిమజ్జనం చేస్తున్న మహిళలు


బతుకమ్మతో చిన్నారి

మద్యం మానేయాలని మందలించినందుకు వృద్ధుడి ఆత్మహత్య


రాజయ్య(ఫైల్)

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మద్యానికి బానిసైన ఓ వ్యక్తిని కుటుంబ సభ్యులు మందలించడంతో మనస్థాపం చెందిన ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన ఎల్లారెడ్డిపేట మండలం నారాయణ పూర్‌లో పండుగ పూట ఆదివారం విషాదం నింపింది. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం మేరకు.. గ్రామంలోని రాయికోటి రాజయ్య(61) కొంత కాలంగా గల్ఫ్ దేశానికి వెళ్లి వస్తుండేవాడు. ఏడాది కిందట స్వగ్రామానికి చేరుకున్న ఆయన స్థానికంగా దినసరి కూలీ పనులు చేస్తున్నాడు. అనారోగ్యంలో బాధపడుతున్న రాజయ్యను కుటుంబసభ్యులు పలు ఆసుపత్రుల్లో చూపించి వైద్యం అందించారు. ఆరోగ్యం కుదుట పడకపోవడంతో మద్యానికి బానిసయ్యాడు. ఈక్రమంలో కుటుంబ సభ్యులు మద్యం మానేయాలని రాజయ్యను ఈనెల 20న మందలించారు. మనస్థాపం చెందిన ఆయన రేకుల షెడ్డులో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడికి భార్య శోభారాణి, కొడుకు బాబు, ఇద్దరు కూతుళ్లు తిరుమల, రాజేశ్వరిలు ఉన్నారు. మృతుడి భార్య శోభారాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్ఐ మోతీరాంనాయక్ పేర్కొన్నారు.

సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ బలవన్మరణం

● పెళ్లయి ఆరు నెలలు ● చందుర్తిలో విషాదం


అరవింద్(ఫైల్)

చందుర్తి, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): పెళ్లయిన ఆరు నెలలకే ఓ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ కుటుంబ కలహాలతో నిద్రమాత్రలు మింగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన వికారాబాద్ జిల్లాఅటవీప్రాంతంలో జరగగా, చందుర్తి మండల కేంద్రంలో విషాదం నింపిన సంఘటన ఆదివారం వెలుగులోకి వచ్చింది. గ్రామస్థుల కథనం ప్రకారం.. చందుర్తి మండల కేంద్రానికి చెందిన ద్యావనపల్లి లక్ష్మీ-రాజు దంపతుల ఏకైక కుమారుడు అరవింద్(30) వివాహం కరీంనగర్‌లోని జూబ్లీనగర్‌కు చెందిన తుమ్మ స్వరూపరాణి-శ్రీనివాస్ దంపతుల కుమార్తె వినూత్నతో గతమార్చి2న వివాహం జరిగింది. భార్యభర్తలు ఇద్దరు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు కావడంతో హైదరాబాదులోని కొండాపూర్ ప్రాంతంలో నివాసం ఉంటూ ఉద్యోగాలు చేస్తున్నారు. ఈనెల 19న కుటుంబ కలహాలతో అరవింద్ ఇంటి నుంచి బయటకు వెళ్లి వికారాబాద్ అటవీప్రాంతంలో నిద్ర మాత్రలు మింగి ఆత్మహత్యకు పాల్పడగా అక్కడి పోలీసులు గుర్తించి, రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండల కేంద్రంలో ఉంటున్న తల్లిదండ్రులకు పోలీసులు ఈనెల 20న రాత్రి సమాచారం అందించారు. భార్య వినూత్న ప్రస్తుత గర్భవతని పేర్కొన్నారు. పెళ్లయిన ఆరు నెలలకే అరవింద్ ఆత్మహత్యకు పాల్పడడంతో చందుర్తిలో విషాదఛాయలు అల్లుకున్నాయి.

విద్యుదాఘాతంతో ఒకరి మృతి


మల్లేష్ నాయక్(ఫైల్)

ధర్మారం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): పంట పొలాన్ని నష్టపరుస్తున్న పక్షులను తోలడానికి వెళ్లిన ఓవ్యక్తి విద్యుదాఘాతానికి గురై మృతి చెందిన ఘటన మండలంలోని కొత్తపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన భూక్య మల్లేష్ నాయక్(45) పొలాన్ని నష్టపరుస్తున్న పక్షులను తోలడానికి ఆదివారం మధ్యాహ్నం వెళ్లాడు. ఈ ప్రయత్నంలో పక్షులు బెదిరే కలర్ రిబ్బన్‌కు ఒక వైరును కట్టి 11కేవీ వైర్లకు వేయగా ప్రమాదవశాత్తు రిబ్బన్ ద్వారా విద్యుత్ సరఫరా అయ్యి మల్లేష్ అక్కడికక్కడే మృతిచెందాడు. మల్లేష్ భార్య భూక్య సునీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు.

గుడుంబా విక్రయదారుడిపై కేసు నమోదు

ధర్మారం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపల్లి గ్రామంలో గుడుంబా తయారు చేసి అమ్ముతున్న వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. కొత్తపల్లి గ్రామానికి చెందిన భూక్య మోతిలాల్ నాయక్ పొలంలో గుడుంబా తయారు చేస్తూ ఇంటి వద్ద విక్రయిస్తున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఆదివారం మోతిలాల్ ఇంటిని తనిఖీ చేసి 12 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకుని, అతనిపై కేసు నమోదు చేశారు. నాటుసారా తయారు, విక్రయించిన, సరఫరా చేసిన వారిపై కఠిన చర్యలు ఉంటాయని ధర్మారం ఎస్ఐ ప్రవీణ్ కుమార్ హెచ్చరించారు.

మెప్మా ఆర్పీలకు తప్పని తిప్పలు


జగిత్యాల కలెక్టరేట్‌కు తరలివచ్చిన మెప్మా రిసోర్స్‌పర్సన్లు

● పీఆర్సీ అమలు కోసం ఎదురుచూపులు
● కనీస గౌరవ వేతనం రూ.20 వేలు ఇవ్వాలని డిమాండ్
● రాష్ట్రంలో ఆరు వేల మంది మెప్మా రిసోర్స్‌పర్సన్లు

జగిత్యాల, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రాంతాల్లో స్వయం సహాయక సంఘాల మహిళల ఆర్థిక అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) రిసోర్స్ పర్సన్లు (ఆర్పీ) కనీస గౌరవ వేతనం దక్కక ఇబ్బందులు పడుతున్నారు. ఆర్పీలకు పీఆర్సీ అమలు కాక పోవడంతో రూ.6 వేల గౌరవ వేతనం మాత్రమే అందడంతో కుటుంబ పోషణ భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మహిళలకు నిధులు సమకూర్చడం, శిక్షణ ఇవ్వడం వంటి పనులను ఆర్పీలు పూర్తి చేస్తారు. పట్టణాల్లోని పొదుపు సంఘాల మహిళలకు ఆర్థికంగా అండగా నిలుస్తుంటారు. సంఘాల కార్యకలాపాలు సక్రమంగా జరిగేలా చూడడంలో కీలక పాత్ర పోషిస్తారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆయా మున్సిపాలిటీల్లో 6 వేల మంది మెప్మా రిసోర్స్ పర్సన్లుగా పనిచేస్తున్నారు. జగిత్యాల జిల్లాలో 173 మంది మెప్మా ఆర్పీలు పనిచేస్తున్నారు.

నెలకు రూ. 600 నుంచి పనిచేస్తున్న ఆర్పీలు..

రెండు దశాబ్దాల క్రితం ప్రభుత్వం మెప్మా ఆర్పీలకు నెలకు 600 పారితోషికం అందించేది. 2018 నుంచి ఆర్పీలకు ప్రభుత్వం నుంచి నెలకు నాలుగు వేల రూపాయల గౌరవ వేతనం, పట్టణ సమాఖ్య నుంచి మరో రెండు వేల రూపాయలు కలిపి ఆరు వేల రూపాయల చొప్పున గౌరవ వేతనాన్ని స్త్రీ నిధి ద్వారా చెల్లిస్తున్నారు. ఇచ్చే తక్కువ వేతనం కూడా ప్రభుత్వం ఇవ్వకుండా స్త్రీ నిధి ద్వారా పారితోషికం పేరుతో ఇవ్వడాన్ని పలువురు ఆర్పీలు వ్యతిరేకిస్తున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అనేక పర్యాయాలు మంత్రులు, కలెక్టర్లుకు వినతిపత్రాలు సమర్పించినా ఫలితం లేకపోయిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తు న్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద ధర్నా చేశారు. అయినా వారి సమస్య పరిష్కారం కాలేదు. ఇటీవల జగిత్యాల జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయానికి మెప్మా ఆర్పీలు తరలివచ్చి తమ అసంతృప్తిని వ్యక్తం చేయడంతో పాటు అధికారులను కలిసి సమస్యను విన్నవించుకున్నారు. కనీస గౌరవ వేతనం ఏ నెలకు ఆ నెల అందించాలని సంబంధిత అధికారులను కోరారు.

30 శాతం పీఆర్సీ అమలుకు డిమాండ్..

జీవో నంబరు 164 ప్రకారం స్త్రీనిధి, లోకల్ బాడీ నిధుల నుంచి ఆర్పీలకు గౌరవ వేతనాలు ఇవ్వాలనే నిబంధనను తొలగించి సెర్ప్ (గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ) వీఓఏల మాదిరిగా ప్రభుత్వ పరంగా ప్రత్యేక నిధులు కేటాయించి గౌరవ వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. నెలకు రూ.20 వేల గౌరవ వేతనం అందించాలని కోరుతున్నారు. గౌరవ వేతనాన్ని ఏ నెలకు ఆ నెల స్వంత ఖాతాల్లో జమ చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తం గా ఆర్పీలకు ఒకే రకమైన డ్రెస్ కోడ్ ఉండేలా చూడాలని ప్రభుత్వాన్ని కోరు తున్నారు.

గత ప్రభుత్వం అన్ని రంగాల వారికి 30 శాతం పీఆర్సీ అమలు చేసి మెప్మా ఆర్పీలను మాత్రం విస్మరించిందని అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. సెర్ప్ వీఓఏల మాదిరిగా మెప్మా ఆర్పీలకు పీఆర్సీ అమలు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. మెప్మా ఆర్పీలకు ఉద్యోగ భద్రత, ఆరోగ్య భద్రత కల్పించాలని కోరుతున్నారు. పని భారం తగ్గించాలని, హెచ్ఆర్ఏ అమలు చేయాల ని వారు డిమాండ్ చేస్తున్నారు. మెప్మా కార్యకలా పాల్లో బాగంగా వివిధ సర్వేలు నిర్వహిస్తామని ఇప్పటికైనా ప్రభుత్వం మెప్మా ఆర్పీల సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని కోరుతున్నారు.

పీఆర్సీఅమలు చేయాలి

రమ, జిల్లా మెప్మా రిసోర్స్ పర్సన్ సంఘం అధ్యక్షురాలు, జగిత్యాల



ప్రభుత్వం మెప్మా రిసోర్స్ పర్సన్లకు 30 శాతం పీఆర్సీ అమలు చేయాలి. ప్రతీ నెల సక్రమంగా వేతనాలు చెల్లించాలి. అరకొరగా ఇస్తున్న గౌరవ వేతనాలు సైతం ఎప్పటికప్పుడు అందించక పోవడంతో ఆర్థికంగా అవస్థలు ఎదుర్కొం టున్నాం. మెప్మా ఆర్పీలకు నెలకు రూ.20వేల గౌరవ వేతనం అందించాలి.

ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకువెళ్లాం

దుర్గపు శ్రీనివాస్‌గౌడ్, మెప్మా అధికారి, జగిత్యాల



మెప్మాలో పనిచేస్తున్న ఆర్పీల సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. సమస్యను పరిష్కరించడానికి అవసరమైన ప్రయత్నాలు చేస్తున్నాం. మెప్మా ఆర్పీల డిమాండ్లను రాష్ట్ర స్థాయిలో ప్రభుత్వం పరిష్కరించాల్సి ఉంటుంది.

రైల్వేస్టేషన్ గదిలో విందు


గదిలో మద్యం బాటిళ్లు

ఓదెల, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని రైల్వేస్టేషన్‌లో శనివారం రాత్రి టికెట్ కౌంటర్ గదిలో రైల్వే కమర్షియల్ అధికారులు విందు చేసుకున్నారు. రాత్రి 10గంటల తర్వాత రైల్వే స్టేషన్‌లో కేకలు, కేరింతలు వినబడడంతో స్టేషన్‌సమీపంలో ఉండే ఓవ్యక్తి విందును సెల్‌ఫోన్‌లో చిత్రీకరించాడు. దీనిని గమనించిన కొందరు అధికారులు వారించారు. అయినప్పటికీ చిత్రీకరించిన వీడియోను వాట్సప్‌లో వైరల్ చేయడంతో విషయం బయటకు వచ్చింది. ఇందులో కమర్షియల్ అధికారులతోపాటు కొందరు టీసీలు కూడా ఉన్నట్లు సమాచారం. ఈవ్యవహారం ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లినట్లు సిబ్బంది తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

ఇల్లంతకుంట, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్సై లక్ష్మి తెలిపారు. ఎస్సై వివరాల ప్రకారం.. మండలంలోని వంతడుపుల గ్రామసమీపంలోని బిక్కవాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారనే సమాచారం మేరకు దాడిచేయగా ట్రాక్టర్ పట్టుబడినట్లు తెలిపారు. ట్రాక్టర్ యజమాని ముద్దల అజయ్, డ్రైవర్ దాసరి సిద్ధార్థలపై కేసునమోదుచేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు. నిబంధనలు అతిక్రమించి ఇసుకను తరలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

ఉమ్మడి జిల్లా స్థాయి భగవద్గీత పఠన పోటీలు


విజేతలైన విద్యార్థులతో అతిథులు

కరీంనగర్ కల్చరల్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): నగరంలోని వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయ కల్యాణ మండపంలో ఆదివారం చిన్మయ మిషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాస్థాయిలో విద్యార్థులకు భగవద్గీత పఠనపోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మిషన్ ఇన్‌చార్జి అక్షయ చైతన్య మాట్లాడుతూ గీతతో సత్ప్రవర్తన, జ్ఞాపకశక్తి, దేశభక్తి అలవడుతాయన్నారు. ఆధ్యాత్మిక మార్గంతో జీవనవిధానం మెరుగుపడుతుందన్నారు. మొత్తం 2వేల మంది విద్యార్థులకు గీతా శ్లోకాలు నేర్పించామన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఆలయ ట్రస్టు చైర్మన్ చిట్టుమల్ల శ్రీనివాస్, మిషన్ ప్రధాన కార్యదర్శి గజవాడ శ్రీనివాస్, జలంధర్, కొండయ్య, రజనీకాంత్, చంద్రం, వసంతం, అనుదీప్, విఘ్నేశ్వర్, శ్రీనివాస్, తిరుపతి, సుదర్శన్, రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

● జిల్లా స్థాయి విజేతలు

ప్రతీ గ్రూపులో ప్రథమ ద్వితీయ తృతీయ బహుమతులు అందించగా బి లో వేదాంశ్, సుదేష్ణ, వినయ్, సిలో కె.అద్వైత్, ఎం. సాన్విక, ఇ.స్నితిక, డిలో మ్యాన శ్రీహిత, బి.మనస్వి, పి.వర్షిత్, ఈ లో శ్రీశాన్వి, కె.తేజస్వి, గాజుల తేజస్వి గెలుపొందారు. వీరికి త్వరలో రాష్ట్ర స్థాయిలో పోటీలు నిర్వహించనున్నారు.

వ్యవసాయబావిలో పడి వృద్ధురాలు మృతి

మానకొండూర్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముంజంపల్లి గ్రామానికి చెందిన గట్టు నర్సమ్మ(85) అనే వృద్ధురాలు వ్యవసాయ బావిలో పడి మృతి చెందింది. సీఐ సంజీవ్ తెలిపిన వివరాల ప్రకారం.. ముంజంపల్లికి చెందిన నర్సమ్మకు కొంత కాలంగా మానసిక స్థితి సరిగా లేదు. ఈ నెల 17న తిమ్మాపూర్ మండలంలోని పొరండ్ల గ్రామంలో ఉండే కూతురు వద్దకు వెళ్లింది. అక్కడి నుంచి 19న ముంజంపల్లికి ఆటోలో వచ్చి సమీపంలోని వ్యవసాయబావిలో పడింది. ఆదివారం వ్యవసాయబావిలో మృతదేహాన్ని గుర్తించిన ఓ రైతు గ్రామస్థులకు తెలియజేయడంతో అక్కడికి వెళ్లి చూడగా నర్సమ్మగా గుర్తించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీసారు. శవ పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం కరీంనగర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కుమారుడు వెంకటి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మానేరు వాగులో పడి ఒకరి మృతి


రవీందర్‌గౌడ్(ఫైల్)

ఓదెల, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుంపుల మానేరువాగులో ఆదివారం ఇల్లంతకుంట మండలం రాచపల్లికి చెందిన ఆరెల్లి రవీందర్‌గౌడ్(50) అనేవ్యక్తి ప్రమాదవశాత్తు మృతి చెందాడు. ఉదయం మానేరు తీరానికి వచ్చిన రవీందర్ నీటిలో ఈదుకుంటూ వస్తుండగా అంతలోనే ఫిట్స్ రావడంతో నీటిలో ఊపిరాడక మృతి చెందాడని గ్రామస్థులు తెలిపారు. మృతుడికి భార్య రమ, ఇద్దరు కుమారులున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పొత్కపల్లి ఎస్ఐ రమేష్ తెలిపారు.

రహదారిపై కొండ చిలువ

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రం శివారులోని ఓ ప్రైవేటు డిగ్రీ, పీజీ కళాశాల సమీపంలో కామారెడ్డి-సిరిసిల్ల ప్రధాన రహదారిపై ఆదివారం రాత్రి కొండ చిలువ ప్రత్యక్షమైంది. రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్ వద్ద నుంచి వెళుతోంది. గమనించిన వాహనదారులు ఆగి హతమార్చేందుకు యత్నించారు. రాళ్లతో కొట్టడడంతో కొండచిలువ తప్పించుకుని పక్కనే ఉన్న వ్యవసాయ పొలాల్లోకి వెళ్లింది.


రోడ్డు పక్కనుంచి వెళుతున్న కొండచిలువ

కాలనీలో వ్యక్తి ఆత్మహత్య

యైటింక్లయిన్‌కాలనీ, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని టుటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని శ్రీలంక షెడ్స్ ప్రాంతానికి చెందిన పెనుగొండ కుమార్ (38) ఆదివారం రాత్రి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సమస్యల కారణంతో ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని స్థానికులు బావిస్తున్నారు. గోదావరిఖని టుటౌన్‌సీఐ ప్రసాద్‌రావు మృతదేహాన్ని ప్రభుత్వఏరియా ఆసుపత్రికి తరలించారు.

రైతును కాటేసిన నాగుపాము

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాచర్లబొప్పాపూర్‌లో ఆదివారం రైతు సత్తయ్యను నాగుపాము కాటేసింది. స్థానికుల కథనం ప్రకారం.. సత్తయ్య రోజులాగే వ్యవసాయక్షేత్రానికి వెళ్లాడు. పొలంలో తిరుగుతుండగా అతన్ని పాము కరిచింది. వెంటనే అతన్ని తోటి రైతులు మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. వైద్యులు చికిత్స అందిస్తున్నారని ప్రస్తుతం సత్తయ్య ఆరోగ్యం నిలకడగా ఉందని వారు స్పష్టం చేశారు.

నీటి ట్యాంక్‌లో పడి ఇద్దరు చిన్నారుల మృతి

● బొమ్మకల్ సిమెంట్ పైపుల ఫ్యాక్టరీలో ఘటన


చిన్నారుల మృతదేహాలు

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): అల్లారుముద్దుగా ఉన్న ఇద్దరు చిన్నారులు ఇంటి బయట ఆడుకుంటూ వెళ్లి ప్రమాదవశాత్తు నీటి ట్యాంక్‌లో పడి మృతి చెందారు. కరీంనగర్ శివారులోని బొమ్మకల్‌లో చోటు చేసుకున్న సంఘటన స్థానికంగా విషాదాన్ని నింపింది. కరీంనగర్ రూరల్‌సీఐ, స్థానికుల వివరాల ప్రకారం... కరీంనగర్ శివారులోని బొమ్మకల్ రోడ్‌లో ఉన్న సత్యం సిమెంట్‌పైపుల ఫ్యాక్టరీలో బీహార్‌కు చెందిన సహనీ బిట్టుకుమార్, అతడి భార్య సుధాదేవి ఐదేళ్ల నుంచి కూలీలుగా పని చేస్తున్నారు. ఇద్దరు కొడుకులు, కూతరుతో ఫ్యాక్టరీ ఆవరణలోని షెడ్డులో నివాసం ఉంటున్నారు. ఆదివారం సాయంత్రం 4 గంటల సమయంలో బిట్టుకుమార్‌మార్కెట్‌కు వెళ్లాడు. భార్య సుధాదేవి ఇంట్లో పనిచేసుకుంటూ ఉంది. కూతురు కూడా ఇంట్లోనే ఉండగా ఇద్దరు కుమారులు సత్యం కుమార్(4), ఆర్యన్‌కుమార్(2) బయట ఆడుకుంటున్నారు. కొంతసేపటికి తల్లి సుధాదేవి బయటకు వచ్చి చూడగా వారు కనిపించలేదు. దీంతో ఫ్యాక్టరీ అవరణలో చూడగా పైపులు క్యూరింగ్ చేసేందుకు ఏర్పాటు చేసిన వాటర్ ట్యాంక్‌లో ఆర్యన్‌కుమార్ మృతదేహం నీటిపై తేలి కనిపించింది. దీంతో ఫ్యాక్టరీలోని కూలీలకు విషయం తెలుపగా అర్యన్‌కుమార్‌ను బయటకు తీశారు. నీటిలోపల వెతకగా సత్యంకుమార్ మృతదేహం కూడా లభ్యమైంది. సమాచారం అందుకున్న కరీంనగర్ రూరల్‌సీఐ నిరంజన్‌రెడ్డి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. చిన్నారుల మృతదేహాలను కరీంనగర్ ప్రభుత్వఆసుపత్రి మార్చురీ గదిలోభద్రపరిచారు. తల్లిదండ్రుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సెలవురోజు కాకపోతే కాపాడేవారేమో..

ఆదివారం సెలవుదినం కాబట్టి ఫ్యాక్టరీలో పనులు బంద్ చేయడంతో ఆవరణలో కూలీలు ఎవరూ లేరు. కొందరు వారివారి గదుల్లో ఉండగా మరికొందరు మార్కెట్, ఇతరపనుల్లో బిజీగా ఉన్నారు. ఇద్దరు చిన్నారులు బయట ఆడుకుంటూ వెళ్లి ప్రమాదవశాత్తు నీటి ట్యాంక్‌లో పడ్డారు. అక్కడ ఎవరూ లేకపోవడంతో గమనించలేదు. ఫ్యాక్టరీ పనివేళల్లో ఐతేఎవరైనా సిబ్బంది గమనించి కాపాడేవారంటూ కుటుంబ సభ్యులు రోధించారు. కూతురు(6) తనతమ్ముళ్లతోకలిసి ఆడుకున్నా ఈ విషయం వెంటనే తల్లికి తెలిసేదని, తల్లితో ఇంట్లో ఉందని చెబుతున్నారు. ఐదేళ్లుగా ఇదే ఫ్యాక్టరీలో పనిచేస్తున్నామని, ఎప్పుడూ ఇలాంటి ఘటన జరగలేదని కూలీలు వాపోయారు. ఫ్యాక్టరీ ఆవరణలో కూలీలు, వారిపిల్లలు నివాసం ఉంటుండడంతో వాటర్ ట్యాంక్‌తో ప్రమాదాలు జరుగకుండా ఫ్యాక్టరీ యాజమాన్యం భద్రతాచర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. వాటర్ ట్యాంక్ వద్దకు ఎవరూ వెళ్లకుండా ఏర్పాట్లు చేయకపోవడంతోనే ఈ ప్రమాదం జరిగిందనే విమర్శలు వస్తున్నాయి. ముఖ్యంగా చిన్న పిల్లలు ఉన్న చోట తగినజాగ్రత్తలు తీసుకుంటే ఇటువంటి ఘటనలు జరిగేందుకు ఆస్కారం ఉండదని, ఇప్పటికైనా ఇటువంటి ప్రమాదకరమైన స్థలాలకు చిన్నారులను దూరంగా ఉంచేలా చర్యలు అధికారులు తీసుకోవాలని ప్రజలు కోతున్నారు.

పోలీసులు కొట్టారని సెల్‌టవర్ ఎక్కి నిరసన

● బాధితుడికి కౌన్సెలింగ్ నిర్వహించిన పోలీసులు


కౌన్సెలింగ్ ఇచ్చేందుకు శ్రీనివాస్‌ను తీసుకెళ్తున్న పోలీసులు

హుజూరాబాద్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): పోలీసులు తనను కొట్టారని నిరసిస్తూ హుజూరాబాద్‌లో ఆదివారం సెల్‌టవర్ ఎక్కి నిరసన వ్యక్తం చేసిన సంఘటన చోటుచేసుకుంది. వివరాలుఇలా ఉన్నాయి.. హుజూరాబాద్ పట్టణంలోని మామిండ్లవాడకు చెందిన శ్రీనివాస్ దళిత బంధు పథకం కింద డిజే సౌండ్స్‌ను కొనుగోలు చేసి వ్యాపారం చేసుకుంటున్నాడు. దుర్గామాత నవరాత్రి ఉత్సవాల సందర్భంగా శనివారం రాత్రి దుర్గామాత విగ్రహాన్ని డీజేతో ఊరేగింపుగా తీసుకెళ్తుండగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో శ్రీనివాస్, పోలీసుల మధ్య మాటమాట పెరగడంతో, డిజే సౌండ్స్‌ను సీజ్‌చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ క్రమంలో పోలీసులు తనపై చేయి చేసుకున్నారని మనస్తాపానికి గురైన శ్రీనివాస్ సెల్‌టవర్ ఎక్కి నిరసన వ్యక్తం చేశాడు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు, కుటుంబసభ్యులు సెల్‌టవర్ దిగాలని విజ్ఞప్తి చేశారు. పోలీ సులు వచ్చి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో శ్రీనివాస్ టవర్ దిగాడు. టౌన్ సీఐ కరుణాకర్ శ్రీనివాస్‌కు కౌన్సెలింగ్ నిర్వహించి, మరోసారి ఇలా చేయవద్దని హెచ్చరించారు. అనంతరం సీఐ కరుణాకర్ మాట్లాడుతూ ఉత్సవాల సందర్భంగా డీజేలు పెట్టరాదన్నారు. ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ ఆర్టీసీ బస్టాండ్‌లో ఆదివారం ఉదయం గుర్తుతెలియని వ్యక్తి(45) మరణించినట్లు కరీంనగర్ వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. మృతుడు తెలుపు షర్ట్, బ్లూకలర్ జీన్స్‌పాయింట్ ధరించి ఉన్నాడని పేర్కొన్నారు. మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రిలోని మార్చురీగదిలో భద్రపరిచినట్లు తెలిపారు. గుర్తించి నవారు వెంటనే వన్‌టౌన్ పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.


గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు ఎంపిక


పతకాలతో విద్యార్థులు

కోరుట్ల, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని కోరుట్ల, మెట్‌పల్లి పట్టణాలకు చెందిన తైక్వాండో కరాటే విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు మాస్టర్ రమేష్ ఆదివారం తెలిపారు. ఈ నెల 20వ తేదిన జగిత్యాల జిల్లా కేంద్రంలోని తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో కోరుట్ల, మెట్‌పల్లి పట్టణాలకు చెందిన విద్యార్థులు పాల్గొని వివిధ విభాగాల్లో రాణించినట్లు తెలిపారు. తైకాండో క్లబ్ కరాటే శిక్షణ పొందిన విద్యార్థులు అండర్-14, అండర్-17 కేటగిరి వివిధ విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో 20 మంది విద్యార్థులు పాల్గొన్నట్టు తెలిపారు. ఇద్దరు గోల్డ్ మెడల్, ఆరుగురు సిల్వర్ మెడల్స్ సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి చక్రధర్‌రావు మెడల్స్‌ను అందించి అభినందించారు. విద్యార్థులను తైక్వాండో అసోషియేషన్ సభ్యులు సంతోష్ కుమార్, గంగారావు, నావనంది రమేష్ అభినందించి సన్మానించారు.



దొంగలున్నారు జాగ్రత్త

- ఇంటికి తాళం కనపడిందో... తెల్లవారేసరికి సొమ్ములు చోరీ
- విలువైన బంగారం, డబ్బులు ఇళ్లలో పెట్టవద్దని పోలీసుల సూచన

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): దసరా సెలవులంటే పిల్లలతోపాటు తల్లిదండ్రులకు ఉత్సాహంగా ఉంటుంది. స్వగ్రామాలు, పల్లెటూళ్లకు వెళ్లడం, విహారయాత్రలు లాంటివి ప్లాన్ చేసుకుంటారు. ఇవే సెలవులు దొంగలకు సెలవుగా మారుతున్నాయి. పట్టణాల్లో నివాసం ఉంటున్న చాలా కుటుంబాలు సెలవుల్లో ఇళ్లకు తాళం వేసి ఇతర ప్రాంతాలకు వెళుతుంటారు. దీనిని దొంగలు అవకాశంగా మలుచు కుంటారు. కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ వ్యాప్తంగా తాళం వేసిన ఇళ్లల్లో దొంగతనాలు ఇటీవలి కాలంలో ఎక్కువగా జరుగుతున్నాయి.

పగటిపూట రెక్కీ.. రాత్రి వేళ చోరీ

తాళంవేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకుంటున్న దొంగలు నగదుతోపాటు బంగారం, వెండి, వాహనాలు, ఇతర విలువైన వస్తువులను ఎత్తుకుపోతున్నారు. పగటి పూట రెక్కీ నిర్వహిస్తూ వారు టార్గెట్‌గా చేసుకున్న ఇళ్ల వద్ద పరిసరాలను పూర్తిగా అవగాహన చేసుకుంటారు. తాళం వేసిన ఇళ్లను గూగుల్ మ్యాప్‌లో లొకేషన్ పిన్ చేసుకుని అర్ధ రాత్రి సమయాల్లో చోరీలకు పాల్పడుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పగటి పూటనే రైతులు ఇళ్లకు తాళం వేసి వ్యవసాయ పనులకు వెళుతున్న సమయంలో అదనుచూసి లూటీ చేస్తున్నారు.

జాగ్రత్తలు తీసుకోవాలి..: గౌస్ ఆలం, సీపీ



దసరా, బతుకమ్మ పండుగల సందర్భంగా ప్రజలు తమ ఇళ్లకు తాళాలు వేసి స్వగ్రామాలకు వెళతారు. ఈ సమయంలో చోరీలను నివారించడానికి పోలీస్ శాఖ తరుపున పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నాము. పండుగకు వెళ్లే ప్రజలు దొంగల బారిన పడకుండా ఉండడానిక్తి జాగ్రత్తలు తీసుకోవాలి. ఎవరైనా అనుమానితులు కనిపిస్తే డయల్ 100కు, బ్లూకోల్ట్స్ సిబ్బందికి, సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలి.

24 గంటల గస్తీ ఉన్నా..

ఒక వైపు బ్లూకోల్ట్స్ పోలీసులు గస్తీ నిర్వహిస్తుండగానే మరో వైపు దొంగలు చోరీలకు పాల్పడుతుండటం ఆందోళనను కలిగిస్తున్నది. దొంగతనాలు జరిగిన తరువాత పోలీసులు కేసు, విచారణ చేపట్టి సీసీ కెమెరాల ఆధారంగా, వేలి ముద్రల ఆధారంగా దొంగలను అరెస్టు చేస్తున్నప్పటికీ బాధితుల సొమ్ములు పూర్తిగా రికవరీ కావడం లేదు. జన సమర్ధ ప్రాంతాలు, శివారు కాలనీ కానీ.. ఏ మూలలో అయినా ఇంటికి తాళం కనపడితే చాలు.. దొంగలు రెచ్చిపోయి ఇంటిలోని విలువైన బంగారం, నగదును అపహరించుకుపోతున్నారు. ఇళ్లకు వేసిన తాళాలు అలాగే ఉండగా గొళ్లాలను చాకచక్యంగా తొలగిస్తున్నారు. దొంగతనం జరిగిన ప్రదేశాల్లో వేలి ముద్రలు పోలీసులకు చిక్కకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ముఖానికి మాస్క్‌లు, వాహనాలకు నంబర్ ప్లేట్లు తొలగించి చోరీలకు పాల్పడుతతున్నారు. ప్రజలు కూడా సరైన భద్రతా చర్యలు తీసుకోవాలని పోలీసులు సూచిస్తున్నారు.

దొంగతనాల నియంత్రణకు కొన్ని ముఖ్యమైన జాగ్రత్తలు...

- ఊరెళ్లే ముందు సమీప పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలి. పెట్రోలింగ్ బృందాలు ఆ ఇంటిపై ప్రత్యేక నిఘా పెడతాయి.
- ఇంటిని గమనిస్తూ ఉండండని ఇరుగుపొరుగు వారికి చెప్పండి. ఇంటికి సంబంధించిన ఏవైనా అనుమానాస్పద విషయాలు ఉంటే వెంటనే తెలియజేయమని చెప్పండి.
- ఊరెళ్లేటప్పుడు ఇంట్లో డబ్బు, బంగారం ఉంచకుండా వాటిని బ్యాంకు లాకర్‌లో భద్రపరచండి. బీరువా తాళాలను ఇంట్లో పెట్టకుండా వెంట తీసుకెళ్లండి.
- ఊరెళ్తున్నట్లు సోషల్ మీడియాలో, వాట్సాప్ స్టేటస్‌లలో పెట్టవద్దు. ఇది నేరగాళ్లకు ఇల్లు ఖాళీగా ఉందని తెలియజేస్తుంది.
- ఇంటికి తాళం వేసినప్పుడు, ఇంట్లోని ఏదో ఒక గదిలో లైటు వేసి ఉంచడం మంచిది. తాళం బయటకు కనిపించకుండా డోర్ కర్టెన్ వేయాలి.
- కాలనీల్లో, ఇంటి పరిసరాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవడం వల్ల దొంగతనాలను నివారించవచ్చు. ఈ విషయంలో ప్రజలు, ప్రజాప్రతినిధులు, వ్యాపారులు సహకరించాలి.
- ఉదయం పూట పూల మొక్కలు, ఇతర వస్తువులు అమ్మేవారి రూపంలో లేదా రాత్రి వేళల్లో అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తులపై నిఘా ఉంచాలి. అనుమానితుల గురించి వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలి.
- పండుగ సందర్భంగా వచ్చే ఆన్‌లైన్ షాపింగ్ ఆఫర్లపై అప్రమత్తంగా ఉండాలి. నకిలీ ఐడీలు సృష్టించి మోసాలు చేసే అవకాశం ఉంది.
- అనవసరంగా వచ్చే మెసేజ్‌లలోని బ్లూ కలర్ లింకులను ఓపెన్ చేయవద్దు. లాటరీ తగిలిందని, గిఫ్ట్ వచ్చిందని, తక్కువ ధరకు వస్తువులు ఇస్తామని వచ్చే సందేశాలను నమ్మవద్దు.
- సైబర్ నేరానికి గురై డబ్బులు పోగొట్టుకుంటే, 24 గంటలలోపు ఫిర్యాదు చేస్తే డబ్బులు రికవరీ అయ్యే అవకాశం ఉంది.
- సైబర్ నేరాల ఫిర్యాదు కోసం 1930 (జాతీయ హెల్ప్‌లైన్), 112, 100
- ఆన్‌లైన్ ఫిర్యాదు www.cybercrime.gov.in వెబ్‌సైట్‌లో చేయాలి.



మాజీ కలెక్టర్ కేఎస్ శర్మ మృతి

- ఉమ్మడి జిల్లాతో విడదీయరాని అనుబంధం



కేఎస్ శర్మ(ఫైల్)

కరీంనగర్ కల్చరల్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడిజిల్లాకు కలెక్టర్‌గా సేవలందించిన కేఎస్ శర్మ(కంభం పాటి సుబ్రహ్మణ్య శర్మ) (80) ఆదివారం అనారోగ్యంతో హైదరాబాద్‌లో మృతిచెందారు. నిజాయితీ, నిబద్ధత గల ఉత్తమ అధికారిగా గుర్తింపు పొందిన ఆయనకు ఉమ్మడి జిల్లాతో విడదీయ రాని అనుబంధం ఉంది.. ఆయన మృతితో కవులు, కళాకారులు, నగర వాసులు, ప్రత్యక్షంగా చూసినవారు గతస్మృతులను నెమరు వేసుకున్నారు. ఆయన హయాంలో కరీంనగర్‌లో త్యాగరాజ లలిత కళాపరిషత్, జవహర్ బాలకేంద్రం, టీఎల్ కే ఓపెన్ ఆడిటోరియం ఏర్పాటుచేశారు. నెహ్రూ యువకేంద్ర బలోపేతానికి కృషిచేశారు. అనేక సంక్షేమ కార్యక్రమాలకు నాంది పలికిన ఆయన ఫిలింభవన్‌తోపాటు అనేకసంస్థలకు స్థలాలు మంజూరు చేశారు. సోమవారం ఆయన అంత్యక్రియలు జరుపనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. శర్మ మృతికి పలువురు కవులు, కళాకారులు, సాహితీ కళాసంస్థల బాధ్యులు, నగరవాసులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.

సెరికల్చర్‌లో రాజన్న సిరిసిల్లకు జాతీయస్థాయి అవార్డు



అవార్డు అందుకుంటున్న డాక్టర్ మల్లికార్జున

సిరిసిల్ల, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): సెరికల్చర్ అభివృద్ధిలో రాజన్న సిరిసిల్ల జిల్లాజాతీయస్థాయి అవార్డును సాధించింది. జిల్లాలోని రైతులకు సెరికల్చర్‌లో పట్టుపురుగుల సాగుకు సంబంధించిన అవగాహన కల్పించడం, సాగు పద్ధతుల్లో శిక్షణ ఇవ్వడంలో జిల్లాను ముందు వరుసలో సెరికల్చర్ సైంటిస్ట్ డాక్టర్ మల్లికార్జున, అసిస్టెంట్ సెరికల్చర్ అధికారి జగన్‌రావులు కృషిచేశారు. ఇందుకు సిల్క్‌బోర్డునుంచి అవార్డులు అందుకున్నారు. జిల్లాసమన్వయకర్తలుగా గ్రామీణ ప్రాంతాల్లో విజయవంతంగా ప్రచార కార్యక్రమాలు, సమావేశాలు సాంకేతిక ప్రదర్శనలు ఇస్తూ రైతులకు అవగాహన కల్పించినందుకు జిల్లాకు అవార్డులు లభించాయి. ఆదివారం బెంగళూరులోని సెంట్రల్ సిల్క్‌బోర్డు ఆధ్వర్యంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో అదనపు డైరెక్టర్ డైరెక్టర్ లత, సైంటిస్ట్ డాక్టర్ మల్లికార్జున అవార్డులు అందుకున్నారు.

బీడీ పరిశ్రమను జీఎస్టీ నుంచి మినహాయించాలి



మాట్లాడుతున్న బీడీ వర్కర్స్ యూనియన్ ప్రతినిధులు

కోరుట్ల, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ నుంచి బీడీ పరిశ్రమను మినహాయించాలని తెలంగాణ ప్రగతిశీల బీడీవర్కర్స్ యూనియన్ సభ్యులు కేంద్రప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. ఆదివారం కోరుట్ల పట్టణంలోని బీడీవర్కర్ యూనియన్ భవనంలో కరీంగనగర్, జగిత్యాల, కామారెడ్డి, రాజన్నసిరిసిల్ల, నిర్మల్, మంచిర్యాల జిల్లాల ప్రతినిధుల కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ బీడీ కార్మికులకు ఆంక్షలులేకుండా పెన్షన్‌కింద జీవనభృతి4000 రూపాయలు చెల్లించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జీఎస్టీపై బీడీపరిశ్రమను మినహాయించే విధంగా తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపాలని డిమాండ్ చేశారు. వచ్చే జనరల్‌కౌన్సిల్ సమావేశం అక్టోబరు20వ తేదీన నిజామాబాద్ జిల్లాకేంద్రంలో నిర్వహిస్తామని జిల్లా ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్రఅధ్యక్షుడు చింతభూమేశ్వర్, కార్యదర్శి సూర్యశివాజీ, వర్కింగ్ ప్రెసిడెంట్ హరిత, భారతి రాష్ట్రకమిటీ సభ్యులు గంగాధర్, అరుణ, శివకుమార్, భూమయ్య పాల్గొన్నారు.

ధర్మపురిలో శేషప్ప కళావేదికపై మహా సత్సంగ్



మహా సత్సంగ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న భక్తులు

ధర్మపురి, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీ నరసింహస్వామి ఆలయ ఆవరణలో గల శేషప్ప కళావేదికపై ధర్మపురి ప్రఖండ ఆధ్వర్యంలో ఎనిమిది సత్సంగాలను కలుపుతూ మహా సత్సంగ్ కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా భాగ్య నగర్ క్షేత్ర సత్సంగ్ ప్రముఖ్ శాలివాహన పండరినాథ్ మాట్లాడుతూ సత్సంగ్ ద్వారా మనసు, వాక్కు శుద్ధి జరుగుతుందని తెలిపారు. హనుమాన్ చాలీసా పారాయణం 21, 21, 108 సార్లు పఠనం చేయడం ద్వారా ఒక్కో ఫలితం పొందగలమని తులసీదాసు తెలిపారని ఆయన అన్నారు. గ్రామాల్లో ప్రతి దేవాలయ కేంద్రంగా సత్సంగ్ నిర్వహణకు కృషిచేయాలని ఆయన కోరారు. రామలింగేశ్వరస్వామి ఆలయంలో సత్సంగ్ మొదటి వార్షికోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో వేదపండితులు పురుషోత్తమాచార్యులు, పూర్వపర్తి సమయ కార్యకర్త జయప్రద, సామాజిక సమరసత టోలి సభ్యులు అల్లం దుర్గప్రసాద్, జిల్లాకార్యదర్శి కస్తూరిరాజన్న, ముత్యపు రమేష్, మామిడాల రవీందర్, వెలగందుల బుచ్చన్న, వెలగందుల రవి తదితరులు పాల్గొన్నారు.

వేములవాడలో ఎంగిలి పూల వైభవం

- రాజన్న ఆలయంలో ఆకట్టుకున్న బతుకమ్మ, దాండియా ఆటలు

వేములవాడ కల్చరల్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఒక్కేసి పువ్వేసి చందమామ.. ఒక్క జాములాయే చందమామ... అంటూ మహిళలు, యువతులు ఎంగిలి పూల బతుకమ్మను వేములవాడ పట్టణం, రాజన్న ఆలయంతో పాటు పల్లేల్లో ఎంతో వైభవంగా చేపట్టారు. మహిళలు, యువతులు, చిన్నారులు సాంప్రదాయ దుస్తుల్లో తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చుకుని కూడళ్ల వద్ద బతుకమ్మలను పెట్టి తెలంగాణ సంప్రదాయ పాటలతో ఆటలాడుతూ సంబరాలు జరుపుకున్నారు. ఎంగిలి పూల తొలిరోజు బతుకమ్మ సందర్భంగా మండలంలోని ఆరెపల్లి, సంకెపల్లి, గొల్లపల్లి, రుద్రవరం, అనుపురం, నాంపల్లి, కొడుముంజ, శాభాష్‌పల్లి, మారుపాక, చంద్రగిరి, చింతలఠాణ, చీర్లవంచ గ్రామాల్లో వాడవాడన డీజే సౌండ్లతో బతుకమ్మ పాటలు మారుమోగిపోయాయి. మహిళలు బతుకమ్మల చుట్టూ వలయాకారంలో క్రమపద్ధతిలో తిరుగుతూ బతుకమ్మ పాటలు పాడగా, యువతులు బతుకమ్మ పాటలతో కోలాటం ఆడుతూ నృత్యాలు చేశారు. అనంతరం గ్రామ శివారులోని చెరువుల్లో బతుకమ్మలను నిమజ్జనం చేశారు.



రాజన్న ఆలయంలో దాండియా ఆడుతున్న యువతులు, మహిళలు

రాజన్న ఆలయంలో..

వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామివారి ఆలయంలో ఆదివారం ఎంగిలి పూల బతుకమ్మలు కన్నుల పండువగా జరిగాయి. పట్టణంలోని మహిళలు బతుకమ్మలతో రాజన్న ఆలయానికి తరలివచ్చి ఆలయంలో బతుకమ్మలను నిలిపి బతుకమ్మ పాటలు పాడుతూ ఆటలు ఆడారు. డిజే సౌండ్ మధ్య యువతులు ఆడిన దాండియా ఆటలు, మహిళలు ఆడిన కోలాటాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. అనంతరం రాజన్న ఆలయ ధర్మగుండంలో బతుకమ్మలను నిమజ్జనం చేశారు. వెంట తీసుకువెళ్లిన ఫలహారాన్ని ఇచ్చిపుచ్చుకున్నారు.



రాజన్న ఆలయంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

రసాయన శాస్త్ర విభాగంలో మంజులకు డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న మంజుల

గణేశ్‌నగర్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయం రసాయనశాస్త్ర విభాగంలో పరిశోధక విద్యార్థి తిరుకోవెల మంజులకు పరీక్షల నియంత్రణ విభాగం డాక్టరేట్ ప్రదానం చేసింది. 'సింథసిస్ ఆఫ్ పైరాన్ అండ్ పైపిరిడిన్ డెరివేటివ్స్ యూసింగ్ నావెల్ మెథడాలజీస్' అనే అంశంపై డాక్టర్ జయంతి పర్యవేక్షణలో పరిశోధన చేశారు. మంజుల ఆదిలాబాద్‌లోని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాల రసాయన శాస్త్ర విభాగంలో అధ్యాపకురాలిగా విధులు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆమె వీసీ ప్రొఫెసర్ ఉమేష్‌కుమార్‌కు, రిజిస్ట్రార్ ఆచార్య రవికుమార్ జాస్తీ, పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ డి.సురేష్ కుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. రమాకాంత్, రసాయన శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ వి.నమ్రత, బోర్డ్‌ఆఫ్ స్టడీస్ చైర్ పర్సన్ డాక్టర్ ఎం.సరసిజకు కృతజ్ఞతలు తెలిపారు.

శ్రీరాంసాగర్‌కు తగ్గిన వరద

- 23 గేట్ల ద్వారా....73,540 క్యూసెక్కులు దిగువకు



దిగువకు దూకుతున్న శ్రీరాంసాగర్ నీరు

జగిత్యాల, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు ఆదివారం వరద నీరు తగ్గింది. 23 గేట్లు పైకి ఎత్తి 73,540 క్యూసెక్కుల నీటిని దిగువ గోదావరిలోకి వదులుతున్నారు. ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతం నుంచి 95,000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రాజెక్టు నీటి నిల్వ 80.5 సామర్థ్యానికి ప్రస్తుతం 80.053 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి తిరిగి ప్రారంభమైన ఎత్తిపోతలు

ఇల్లంతకుంట: మండలంలోని అనంతగిరి గ్రామ సమీపంలోని అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి ఒక పంపుద్వారా తిరిగి నీటి ఎత్తిపోతలు ఆదివారం ప్రారంభం అయ్యాయి. 3.5టీఎంసీల సామర్థ్యం ఉన్న అన్నపూర్ణ రిజర్వాయర్‌లో ప్రస్తుతం 3.26టీఎంసీల నీరు ఉంది. మధ్యమానేరు ద్వారా వచ్చిన 3200క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తుండగా ఎగువన ఉన్న రంగనాయకసాగర్‌కు 3300క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

మిడ్ మానేరుకు కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

బోయినపల్లి: శ్రీ రాజరాజేశ్వర జలాశయానికి(మిడ్ మానేరు) ప్రాజెక్టుకు ఆదివారం 6300క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ఎస్సారెస్పీ నుంచి వరద కాలువ ద్వారా 4500మానేరు, ములవాగు ద్వారా 1800 క్యూసెక్కుల నీటి ప్రవాహం కొనసాగుతోంది. దిగువకు మూడు గేట్ల ద్వారా 5500 క్యూసెక్కులు ప్యాకేజీ 9లోని మల్కపేట రిజర్వాయర్‌కు క్యూసెక్కులు, ప్యాకేజీ 10లోని అన్నపూర్ణ రిజర్వాయర్‌కు 3200 నీటిని తరలిస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 318 మీటర్లకు ప్రస్తుతం317.89 ఉండగా, సామర్థ్యం 27.55 టీఎంసీలకు 27.273 టీఎంసీల మేరకు నీరు నిల్వ ఉంది.

ఎల్‌ఎండీ నుంచి కొనసాగుతున్న నీటి విడుదల

తిమ్మాపూర్ : దిగువ మానేరు జలాశయం నుంచి నీటి విడుదల కొనసాగుతోంది. ఎల్‌ఎండీ పూర్తిస్థాయి నీటిమట్టం 24.034టీఎంసీలు కాగా ప్రస్తుతం 23.645టీఎంసీల నీరునిల్వ ఉంది. మోయతుమ్మెద వాగు నుంచి 5909క్యూసెక్కులు, మిడ్‌మానేరు నుంచి 5500 క్యూసెక్కులు, ఎగువ కాకతీయకాలువ నుంచి 200క్యూసెక్కులు మొత్తం 11,609క్యూసెక్కులు ఎల్‌ఎండీలోకి ఇన్‌ఫ్లో వస్తోంది. నాలుగు గేట్ల నుంచి 8వేల క్యూసెక్కులు, కాకతీయ కాలువ నుంచి 4500క్యూసెక్కులు, మిషన్‌భగీరథ, ఆవిరిరూపంలో 309క్యూసెక్కులు మొత్తం 12,809క్యూసెక్కుల నీరు అవుట్ ఫ్లో వెలుతోంది.

బీఆర్‌ఎస్ హయాంలో ప్రజలకు చేసిందేమీ లేదు

- మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

ధర్మపురి, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): పదేళ్ల కాలంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రజలకు చేసిందేమీ లేదని రాష్ట్ర ఎస్సీఎస్టీమైనార్టీ, వికలాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. ధర్మపురి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ హయాంలో మంత్రిగా ఉన్న కొప్పుల ఈశ్వర్ నియోజకవర్గంలో సాధించిందేమీ లేదని, తననోటికి వచ్చినట్లు మాట్లాడితే ఊరుకునేది లేదని ఆయన హెచ్చరించారు. 2014 నుంచి 2023 వరకు అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని ఆయన అన్నారు. కాంగ్రెస్ అధికారం చేపట్టిన అనంతరం ఇచ్చిన హామీలను నెరవేర్చుతున్నట్లు ఆయన గుర్తుచేశారు. ఆరు గ్యారెంటీల్లో నాలుగు అమలు చేసి ఎంత కష్టమైన మరోరెండు గ్యారెంటీ పథకాలను ఇచ్చి తీరుతామని ఆయన తెలిపారు. ప్రతీ గ్రామంలో పేద వారికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి వారంవారం లబ్ధిదారులకు డబ్బులు చెల్లిస్తున్నామని ఆయన అన్నారు.



మాట్లాడుతున్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

ఇందిరమ్మ ఇళ్లు కట్టలేదని ఆరోపించిన కొప్పుల ఈశ్వర్ ఇంటి ప్రారంభోత్సవానికి పిలిస్తే వస్తారా అని ఆయన ప్రశ్నించారు. చెగ్యాం ముంపు బాధితులకు నష్టపరిహారం ఇప్పించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని ఆయన అన్నారు.

కాళేశ్వరం ప్రాజెక్టు నుండి నీరు సిద్దిపేటకు తరలించుకపోతుంటే కొప్పులఈశ్వర్ నియో జకవర్గానికి ఏమి చేశారో చెప్పాలని ఆయన సవాల్ విసిరారు. అధికారం కోల్పోయి అక్కసుతో కొప్పుల ఈశ్వర్ ఆరోపణలు మానుకోవాలని ఆయన సూచించారు. యూరియా కొరత దేశమంతా ఉందని ఇందుకు కేంద్ర ప్రభుత్వమే కారణమని ఆయన పేర్కొన్నారు. కేంద్రంలో ఉన్న బీజేపీ ఎంపీలు యూరియా కొరత గురించి సంబంధిత మంత్రులను కోరలేదని, కాంగ్రెస్ ఎంపీలు మాత్రమే యూరియా అందించాలని కోరడం జరిగిందని ఆయన అన్నారు.

బీఆర్‌ఎస్‌లో చాలామంది నాయకులు తమతో టచ్‌లో ఉన్నారని తాము గేట్లు తెరిస్తే మీపక్కన ఎవరు కూడా మిగలరని ఆయన తెలిపారు. ధర్మపురి పట్టణంలో త్వరలో డిగ్రీకళాశాల ఏర్పాటు చేస్తామని తెలిపారు. సమావేశంలో ధర్మపురి ఆలయ ధర్మకర్తల మండలిచైర్మన్ జక్కు రవీందర్, టీపీసీసీసభ్యుడు, కాంగ్రెస్‌మండల అధ్యక్షుడు సంగనభట్ల దినేష్, ఉపాధ్యక్షుడు వేముల రాజేష్, పట్టణకాంగ్రెస్ అధ్యక్షుడు చీపిరిశెట్టిరాజేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కుంట సుధాకర్, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు అప్పం తిరుపతి, ధర్మారం ఏఎంసీ చైర్మన్ రాష్ట్రానాయక్, జిల్లాకాంగ్రెస్ ఎస్సీసెల్ ఉపాధ్యక్షుడు చిలుముల లక్ష్మణ్, ఏఎంసీ వైస్‌చైర్మన్ సంగ నర్సింహులు, ప్రదీప్‌రెడ్డి, జంగిలి ప్రభాకర్, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సౌదీలో అనారోగ్యంతో తక్కళ్లపల్లి వాసి మృతి

కథలాపూర్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తక్కళ్లపల్లికి చెందిన సంగ మల్లయ్య(59) అనే గల్ఫ్ వలసజీవి అనారో గ్యంతో సౌదీలో రెండురోజుల కిందట మృతి చెందాడు. కుటుంబ సభ్యులు, గ్రామస్థులు తెలి పిన వివరాల ప్రకారం.. మల్లయ్య 25 సంవ త్సరాలుగా సౌదీలో ఓ అరబ్ షేక్ ఇంట్లో తోట మాలిగా పనిచేస్తున్నాడు. అయితే ఈ మధ్య మెడుకు సంబంధించిన సమస్యతో ఇబ్బందులు పడుతుండగా ఆసుపత్రిలో చికిత్స చేయించుకున్నాడు. ఆ సమస్య తీవ్రం కావడంతో మృతిచెందాడు. మృతుడికి కొడుకు, కూతురు ఉన్నారు. తండ్రి మృతి చెందిన విషయం తెలుసుకున్న కొడుకు దుబాయి నుంచి స్వగ్రామం చేరుకున్నాడు. కాగా మృతదేహాన్ని స్వగ్రామానికి పంపించేలా చూడాలని వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను మాజీ సర్పంచ్ అల్లకొండ లింగంగౌడ్ కోరగా ఎంబసీ అధికారులతో ఎమ్మెల్యే మాట్లాడారు. అంబులెన్స్ వసతి ఉచితంగా కల్పిస్తానని అదేవిధంగా గల్ఫ్ పాలసీలో భాగంగా అందించే ఐదు లక్షల రూపాయలు ఇప్పిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్టు లింగంగౌడ్ తెలిపారు.



మల్లయ్య(ఫైల్)

పల్లెల్లో బతుకమ్మ సంబురాలు..


రాచర్లబొప్పాపూర్‌లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు


వీర్నపల్లిలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు


గంభీరావుపేటలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

ఎల్లారెడ్డిపేట/వీర్నపల్లి, సెప్టెంబరు21(ఆంధ్రజ్యోతి) : ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి మండలాల్లో పితృ అమావాస్య వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. మండల కేంద్రాలతో పాటు రాచర్లగొల్లపల్లి, రాచర్లబొప్పాపూర్, వెంకటాపూర్, పదిర, హరిదాస్‌నగర్, దుమాల, అక్కపల్లి, అల్మాస్‌పూర్, రాచర్లగుండారం, రాచర్లతిమ్మాపూర్, కంచర్ల, మద్దిమల్ల, రంగంపేట, అడవిపదిర, గర్జపల్లి, వన్‌పల్లి, తదితర గ్రామాల్లో ఉదయం ఆలయాల వద్ద బ్రహ్మణులకు బియ్యం ఇచ్చి పెద్దలను గుర్తుచేసుకున్నారు. మహిళలు, యువతులు రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి అందంగా అలంకరించారు. సాయంత్రం మహిళలు, యువతులు నూతన వస్త్రాలు ధరించి బతుకమ్మ సంబురాలు నిర్వహించారు. ప్రధాన కూడళ్ల వద్ద బతుకమ్మలను ఉంచి పాటలు పాడుతూ ఆటలు ఆడారు. యువతులు చిన్నారులు దండియా, కోలాటాలు ఆడారు.

● గంభీరావుపేట : గంభీరావుపేట మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో ఆదివారం బతుకమ్మ సంబరాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. రంగురంగుల పూలతో పేర్చిన బతుకమ్మలను ప్రధాన కూడళ్లలో పెట్టి బతుకమ్మ ఆడారు. బతుకమ్మ పాటలతో ఎంతో ఆనందోత్సవాల మధ్య బతుకమ్మ పండుగ సంబరాలను జరుపుకున్నారు.

● తంగళ్లపల్లి : తంగళ్లపల్లి మండలంలో ఎంగిలి పూల బతుకమ్మ వేడు కలు ఘనంగా జరుపుకున్నారు. ఆయా గ్రామ కూడళ్లలో రంగుల రంగుల బతుకమ్మలను పెట్టి ఆటపాటతో కొలిచారు. పంచాయతీ గ్రామ కూడళ్లలో ప్రత్యేకంగా విద్యుత్తు దీపాలను అమర్చారు. మహిళలు బతుకమ్మ ఆటలతో సందడి నెలకొంది.

● బోయినపల్లి : బోయినపల్లి మండలంలోని అన్ని గ్రామాల్లో బతుకమ్మ వేడుకలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మహిళలు వివిధ రకాల పూలతో బతుకమ్మను పేర్చి ఆయా గ్రామాల ముఖ్య కూడల్లో బతుకమ్మ పాటలు పాడుతూ ఆటలాలు ఆడి నిమజ్జనం చేశారు.

● ఇల్లంతకుంట : బతుకమ్మ వేడుకలు మండలంలోని పలు గ్రామాలలో ఆదివారం ఘనంగా ప్రారంభం అయ్యాయి. తొలిరోజు ఎంగిలిపూల బతుకమ్మలను గ్రామాలలో కూడళ్లలో ఉంచి మహిళలు లయబద్ధంగా పాటలు పాడుతు ఉత్సాహంగా గడిపారు. అనంతరం గ్రామాల సమీపంలోని బతుకమ్మ తెప్పలలో నిమజ్జనం చేశారు.


కనగర్తిలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

● కోనరావుపేట : కోనరావుపేట మండలంలో బతుకమ్మ సంబరాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. తెలంగాణ సాంస్కృతి సాంప్రదాయాలకు అద్దం పట్టే బతుకమ్మ సంబరాలు ఘనంగా జరుపుకున్నారు. ఈ రోజు నుండి ఏడు రోజుల పాటు మహిళలు తీరైన పూలతో బతుకమ్మను పేర్చి బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో బంగారు బతుకమ్మ ఉయ్యాలో అంటూ పాటలు పాడుతూ సంబరాలు జరుపుకుంటారు. చివరి రోజు సద్దుల బతుకమ్మను ఘనంగా జరుపుకొని ఆయా గ్రామాల్లోని చెరువుల్లో నిమజ్జనం చేస్తారు.

● రుద్రంగి : రుద్రంగి మండలంలోని గ్రామాల్లో బతుకమ్మ వేడుకలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా మహిళలు తంగేడు, బంతి, గునకపూలతో పాటు పలు రకాల పూలతో బతుకమ్మను పేర్చి ఆయా గ్రామాల ముఖ్యకూడల్లో బతుకమ్మ పాటలు పాడుతూ ఆటలాడి ఆడి నిమజ్జనం చేశారు.

● చందుర్తి : బతుకమ్మ పండుగ సంబురాలు మండల వ్యాప్తంగా ఆదివారం సాయంత్రం ప్రారంభమయ్యాయి. తెలంగాణ సంస్కృతికి, సంప్రదాయాలకు ప్రతీక అయిన బతుకమ్మను తొలిరోజు ఎంగిలిపూలతో కొలిచారు. తీరొక్క పువ్వులతో బతుకమ్మలను అలంకరించారు. సాయంత్రం వేళల్లో గ్రామాల్లో వీధుల్లోకి బతుకమ్మను తీసుకువచ్చి ఒక్కేసి పువ్వేసి చందమామ.. ఉయ్యాల పాటలు పడుతూ.. చప్పట్లు కొడుతూ ఆటలాడారు. అనంతరం బతుకమ్మను బతుకమ్మ తెప్పలో నిమజ్జనం చేసి వాయినాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధులు లావణ్య, ప్రేమలత, రేణుక, జమున తదితరులు పాల్గొన్నారు.


తంగళ్లపల్లిలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు


బోయినపల్లిలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు


రుద్రంగిలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

రియల్ వ్యాపారుల మధ్య..

ఆర్థిక లావాదేవీల్లో విభేదాలు

- రియల్టర్ రమేష్ హత్యపై పలు కోణాల్లో పోలీసుల విచారణ

సిరిసిల్ల క్రైం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): భూవివాదాల్లో విభేదాలు హద్దులు దాటుతున్నాయి. రియల్‌ఎస్టేట్ భాగస్వాములు,కమీషన్ ఏజెంట్లు మధ్య ప్లాట్ల దందాలో విభేదాలు తలెత్తి హత్యలకు దారితీస్తున్నాయి. వేములవాడ నంది కమాన్ వద్ద జరిగిన సిరిసిల్ల మాజీ కౌన్సిలర్, రియల్టర్ సిరిగిరి రమేష్ హత్యపై పోలీసుల విచారణ కొనసాగుతోంది. జిల్లాలో వివిధ కారణాల వల్ల 2022లో 15,2023 సెప్టెంబర్ 20, 2025 వరకు 10హత్యలు జరిగాయి. రాజన్న సిరిసిల్ల జిల్లాలో కొంత కాలంగా రియల్ ఎస్టేట్ వ్యాపారం స్తంభించిపోయింది. దీంతో రియల్ వ్యాపారుల మధ్య ఆర్థిక లావాదేవీలలో విభేదాలు ఏర్పడుతున్నాయి. ఇదేవిధంగా ఒక్కో ప్లాట్‌ను నంబర్స్ మార్చి ఇద్దరి, ముగ్గురికి రిజిస్ట్రేషన్ చేసేస్తున్నారు. ఇందుకు జీపీఏ, ఏజీపీఏ, సేల్‌డీడ్‌లలో నెలకొన్న నిబంధనలు కొనుగోలు చేసిన ప్లాట్ల యజమానుల మధ్య హద్దుల ఉల్లంఘనలో గొడవలు తలెత్తుతున్నాయి. రియల్ ఎస్టేట్ వ్యాపారంలో మోసాల వల్ల అనేక మంది బాధితులు పోలీస్ స్టేషన్ల మెట్లెక్కుతున్నారు. ఈ విధమైన రియల్ ఎస్టేట్ వ్యాపారాలు, భూకబ్జాల వల్ల సిరిసిల్ల, వేములవాడ ప్రాంతాల్లో కొంతకాలంగా 64కేసులు నమోదయ్యాయి. ఈ కేసుల్లో 40మంది జైలుకు వెళ్లి వచ్చారు. సిరిసిల్ల పట్టణంలోని అంబేద్కర్ నగర్‌కు చెందిన మాజీ కౌన్సిలర్ సిరిగిరి రమేష్ వేములవాడ ప్రాంతంలో నందీశ్వర వెంచర్ పేరుతో 25ఏళ్ల క్రితం మొదటిసారి ప్లాటింగ్ చేశారు. ముందు స్కీం పేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారం సాగించి ప్లాట్స్ విక్రయించారు. ఇదే వెంచర్‌లో రియల్టర్ రమేష్ హత్యకు గురవడం సిరిసిల్ల, వేములవాడ ప్రాంతంలో చర్చ నియాంశమైంది. అంతకుముందే రమేష్ పలుమార్లు జైలుకు వెళ్లివచ్చాడు. రమేష్ హత్యపై పోలీసులు విచారణ వేగవంతం చేశారు. పలువురిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. ఈ హత్యలో ఎవరెవరి ప్రమేయం ఉందనే కోణంలో విచారణ జరుగుతోంది. ఇప్పటికే రమేష్ హత్యపై పోలీసులు పురోగతి సాధించారని తెలిసింది. ఇటీవల చందుర్తిలోను భూ వివాదంలో ఓ వృద్ధురాలిని హత్య చేశారు. గతంలో ఇల్లంతకుంట ప్రాంతంలోనూ భూవ్యవహారం హత్యకు కారణమైంది. రియల్ ఎస్టేట్ వ్యాపారం, భూమి హద్దులు, తప్పుడు పత్రాలు చూపించి భూములు విక్రయించడం, వ్యయసాయ భూములలో గేట్లు, ఇతర వ్యవహారాల్లో మనస్పర్థలు, విభేదాలు తలెత్తడం వల్ల దాడులకు, హత్యలకు దారి తీస్తున్నాయి.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

తంగళ్లపల్లి, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పద్మనగర్ శివారులో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందగా, మరొకరు గాయపడ్డారు. కారులో దంపతులు సిద్దిపేట నుంచి సిరిసిల్ల వైపు వెళుతుండగా ఎదురుగా వస్తున్న మరో కారు ఢీకొనడంతో జగిత్యాల జిల్లా కోరుట్లకు చెందిన శ్రీధర్(45) మృతిచెందగా, భార్య లక్ష్మి గాయపడింది. ఈ సంఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

అధికారుల నిర్లక్ష్యం.. చీకట్లోనే బతుకమ్మ ఉత్సవం..

- ఇబ్బందులు పడిన మహిళలు

ఎల్లారెడ్డిపేట/ వీర్నపల్లి, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): ప్రకృతిని ఆరాధించడం తోపాటు తెలంగాణ ఆడపడచులకు అతి పెద్ద పండుగైన బతుకమ్మ వేడుకలు ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి మండలాల్లో అధికారుల నిర్లక్ష్యం వల్ల ఆదివారం రాత్రి చీకట్లోనే కొనసాగించాల్సిన దుస్థితి దాపురించింది. గ్రామ వీధుల్లో విద్యుత్తు దీపాలను ఏర్పాటు చేయాల్సిన సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోకపోవడంతో మహిళలు బతుకమ్మ ఆటలు ఆడేందుకు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మండల కేంద్రాలతో పాటు పలు గ్రామాల్లో సెల్‌ఫోనుల టార్చ్‌లైటు వెలుతురులో కోలాటలు, బతుకమ్మ ఆటలు ఆడడంపై గ్రామస్థులు, మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రధాన కూడళ్లలో కనీసం విద్యుత్తు దీపాలను ఏర్పాటు చేయడకపోవడంపై మండిపడుతున్నారు. చీకటిలోనే బతుకమ్మ ఆటలు కొనసాగాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి గ్రామాల్లోని వీధి దీపాలను ఏర్పాటు చేసి వెలుగుల మధ్య బతుకమ్మ ఆటలు ఆడేలా చర్యలు తీసుకోవాలని మహిళలు కోరుతున్నారు.

ఘనంగా ప్రారంభమైన శరన్నవరాత్రి ఉత్సవాలు


దుర్గామాత శోభాయాత్రలో పాల్గొన్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్


కోనరావుపేటలో కొలువుదీరిన దుర్గామాత

చందుర్తి, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : చందుర్తి మండల కేంద్రంతో పాటు మూడపల్లి, మర్రిగడ్డ, నర్సింగాపూర్ రామన్నపేట, తిమ్మాపూర్, మల్యాల, లింగంపేట, బండపల్లి తదితర గ్రామాల్లో ఆదివారం శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. చందుర్తిలో దుర్గా మాత శోభాయాత్రలో భాగంగా లయన్స్ యూత్ నవదుర్గ ఉత్సవ సమితి వారి ఆధ్వర్యంలో నిర్వహించిన దుర్గామాత అమ్మవారి శోభాయాత్రలో వేములవాడ ఎమ్మెల్యే రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు. ప్రభుత్వ విప్ కొబ్బరికాయ కొట్టి అమ్మవారి శోభాయాత్రను ప్రారంభించారు. అనంతరం చావా డోలక్ బృందం కళాకారులతో కలసి సరదాగా డోలు వాయించారు. అమ్మవారి దీవెనలతో ప్రజలంతా ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రభుత్వ విప్ వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో సీఐ వెంకటేశ్వర్లు, యువనాయకుడు ఆది కార్తీక్, దుర్గామాత ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

● కోనరావుపేట : దేవి శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా దుర్గామాత ఆదివారం కొలువుదీరింది. కోనరావుపేట మండల కేంద్రంతో పాటు సుద్దాల, నిజామాబాద్ తదితర గ్రామాల్లో దుర్గామాతను డప్పుచప్పుళ్ల మధ్య అమ్మవారిని ఊరేగింపుగా తీసుకువచ్చి ఏర్పాటు చేసిన మండపాల్లో ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ఈ రోజు నుంచి తొమ్మిది రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఆదివారం కొలువుదీరిన అమ్మవారిని మహిళలు మంగళహారతులతో వచ్చి దర్శించుకున్నారు.

భక్తిశ్రద్ధలతో పండగ జరుపుకోవాలి : సీఐ

కోనరావుపేట మండల కేంద్రంలో దుర్గామాత ఆగమనం కార్యక్రమం దుర్గామాత ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొని సీఐ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ యువత భక్తిశ్రద్ధలతో దుర్గామాత పండగ జరుపుకోవాలని అన్నారు. దుర్గామాత ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో 9రోజులు దేవీ నవరాత్రుల ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమానికి సెస్ వైస్ చైర్మన్ దేవరకొండ తిరుపతి, కెంద గంగాధర్, బిజెపి మండల అధ్యక్షుడు బాలాజీ, నాయకులు జవ్వాజి ప్రసాద్, దుర్గామాత ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి


ఎల్లారెడ్డిపేటలో నివాళులర్పిస్తున్న పద్మశాలి సంఘం నాయకులు


తంగళ్లపల్లిలో నివాళులర్పిస్తున్న పద్మశాలి సంఘం నాయకులు

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : స్వాతంత్ర్య సమరయోధుడు, తెలంగాణ ధీరుడు కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతిని ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. లక్ష్మణ్ బాపూజీ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు దేవాంతం, ప్రధానకార్యదర్శి రమేశ్, ఉపాధ్యక్షులు దేవదాస్, సుదర్శన్, కోశాధికారి బాలరాజు, సంయుక్త కార్యదర్శి అంబదాస్, యూత్ అధ్యక్షుడు బాస్కర్, ప్రధాన కార్యదర్శి విష్ణుమూర్తి, దైవశెట్టి సుంకి వేణు, సభ్యులు వనం ఎల్లయ్య, పోతు ఆంజనేయులు, గాజుల దేవదాస్, దోమల భాస్కర్, దొడ్ల సంజీవ్, మ్యాన రంగయ్య, దూస శ్రీనివాస్, రాపల్లి రమేశ్ పాల్గొన్నారు.

● తంగళ్లపల్లి : తంగళ్లపల్లి మండల కేంద్రంలో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మార్కండేయ దేవాలయం వద్ద బాపూజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం అధ్యక్షుడు రాపెల్లి ఆనందం తదితరులు ఉన్నారు.

హిందువుల ఐక్యతను పెంచడమే ఆర్ఎస్ఎస్ లక్ష్యం


మాట్లాడుతున్న వంశీకృష్ణ

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : హిందువుల్లో ఐక్యతను పెంచడమే ఆర్‌ఎస్ఎస్ లక్ష్యమని ఆ విభాగం జిల్లా సహ శారీరక్ ప్రముఖ్ వంశీకృష్ణ అన్నారు. ఆర్‌ఎస్ఎస్ వందేళ్ల స్థాపన ఉత్సవాల్లో భాగంగా ఎల్లారెడ్డిపేట మండలం హరిదాస్‌నగర్ గ్రామంలో ఆదివారం విజయదశమి వేడుకను నిర్వహించారు. ఈ సందర్భంగా వంశీకృష్ణ మాట్లాడుతూ ప్రపంచంలోని వివిధ మతాలను సమన్వయపరిచే సనాతన జీవన విలువలు హిందుత్వంలో ఉన్నాయని అన్నారు. దేశభక్తి, అభివృద్ధికి పాటుపడుతోందని అన్నారు. సామాజిక సమరసత, కుటుంబ జీవన విలువలు, పర్యావరణ పరిరక్షణ, పౌర విధులు ప్రతి కుటుంబంలోని సభ్యులు పాటించాలని అన్నారు. రానున్న రోజుల్లో ఆర్‌ఎస్ఆస్ ఆధ్వర్యంలో ఇంటింటా జన జాగరణ కార్యక్రమాన్ని చేపట్టనున్నామని వంశీకృష్ణ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆ విభాగం సభ్యులు పాల్గొన్నారు.

అమ్మో అమెరికానా..!

(5వ పేజీ తరువాయి)

కార్మికులు వ్యవ సాయ కూలీలు, చిన్నచిన్న ప్రైవేటు ఉద్యోగాలు చేస్తూ కష్టపడి చది వించిన పిల్లలను బ్యాంకు రుణాలు తీసుకుని అమెరికాకు పంపించారు. ఇంజనీరింగ్ చదివి జీఆర్ఈ, టోఫెల్‌లాంటి పరీక్షలు రాసి ఎఫ్1 స్టూడెంట్ వీసా పొంది బ్యాంకుల నుంచి రూ.30 నుంచి 50లక్షల వరకు రుణాలు పొంది అమెరికా చదువులకోసం ఆర్థిక భారాన్ని భరిస్తూ భవిష్యత్తు బాగుంటుందని ఆశతో వెళ్లారు. ఇతర దేశాల విద్యార్థులు, ఉద్యోగులపైన ట్రంప్ అధికారంలోకి రావడంతోనే పలు నిబంధనలతో ఇబ్బందులు పడుతున్న తీరు వామ్మో అమెరికా.. అనే పరిస్థితి వచ్చింది. ఎఫ్1 వీసా నిబంధనలు కఠినతరం చేయడంతో పాటు అమెరికాలో పార్ట్ టైమ్ ఉద్యోగాలు చేస్తున్నవారిని తిప్పి పంపిస్తుండంతో నిత్యం పార్ట్‌టైమ్ పనులు చేసుకొనే విద్యార్థులు కలవరపడుతున్నారు. అంతేకాకుండా పెళ్లిళ్లపై ప్రభావం చూపుతున్నాయి. ఇండియాకు వస్తే తిరిగి వెళ్లలేని పరిస్థితిలో తల్లిదండ్రులే ఎంతో అట్టహాసంగా పెళ్లి జరిపించాలని కోరికలను వదిలి అమెరికాకు వెళ్లి సాదాసీదాగా పెళ్లిళ్లు చేసి వస్తున్నారు. ట్రంప్ ఆంక్షలు రోజురోజుకు మారుతున్న తీరుపై జిల్లాలోని ఎన్నారై కుటుంబ సభ్యులు, తల్లిదండ్రుల్లో తీవ్ర ఆందోళనలు నెలకొన్నాయి.

డబుల్‌బెడ్‌రూం ఇళ్లను పంపిణీ చేయాలి

ఇల్లంతకుంట, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి) : మండలకేంద్రంలోని డబుల్ బెడ్‌రూం ఇళ్లను వెంటనే పంపిణీ చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కోకన్వీనర్ సావనపెల్లి రాకేష్ పేర్కొన్నారు. మండలకేంద్రంలో ఆదివారం మాట్లాడుతూ ఇల్లంతకుంటలో డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాలు చేపట్టి నాలుగు సంవత్సరాలు పూర్తి అయ్యిందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 22నెలలు గడిచిపోయినా నిర్మాణం పూర్తి అయిన డబుల్ బెడ్‌రూంలను ఇంత వరకు లబ్ధిదారులకు పంపిణీ చేయలేదన్నారు. లబ్ధిదారులకు గ్రామసభ ద్వారా ఎంపికచేశారని, వారు అద్దె ఇళ్లలో ఉంటున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం సమస్యను పరిష్కరించాలని కోరారు. సమావేశంలో యువజన సంఘాల జేఏసీ అధ్యక్షుడు మామిడి విజయ్, ఏనుగుల లింగన్న, దాసరి రవి పాల్గొన్నారు.

ఆలయ పునర్నిర్మాణ కమిటీ ఎన్నిక

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగొల్లపల్లిలోని గౌడ సంఘం ఆధ్వర్యంలో చేపట్టనున్న రేణుక ఎల్లమ్మ ఆలయ పునర్నిర్మాణ కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఆకుల రమేశ్‌గౌడ్‌తో పాటు 11 మంది సభ్యులు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు రమేశ్‌గౌడ్, నారాయణగౌడ్, గణపతిగౌడ్, దాస్‌గౌడ్, కిషన్‌గౌడ్, రవికాంత్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహారావుపై ఆరోపణలు సరికాదు


కోనరావుపేటలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

కోనరావుపేట, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : బీఆర్ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావుపై ప్యాక్స్ చైర్మన్ బండ నర్సయ్య చేసిన ఆరోపణలను ఆ పార్టీ నాయకులు ఆదివారం ఖండించారు. కోనరావుపేట మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు చంద్రయ్య గౌడ్, దేవరకొండ తిరుపతి, మల్యాల దేవయ్య మాట్లాడుతూ కోనరావుపేట సింగిల్‌విండో చైర్మన్ బండ నర్సయ్య పార్టీ నుంచి కాంగ్రెస్‌లో చేరి లక్ష్మీనరసింహారావుపై ఆరోపణలు చేయడం సరైనది కాదన్నారు. 25 సంవత్సరాలుగా బీఆర్ఎస్ పార్టీలో ఉండి పదవులు అనుభవించాడని ఆరోపించారు. అలాంటి పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరారని, అయినా పార్టీకి నష్టం ఏమీ లేదన్నారు. ఆరోపణలు మానుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కోనరావుపేట బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ విజేతలకు బహుమతులు ప్రదానం


బహుమతులతో క్రికెట్ టోర్నమెంటు విజేతలు

గంభీరావుపేట, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంటు విజేతలకు బహుమతులను అందజేశారు. ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా గత నెలలో ఈ టోర్నమెంటును నిర్వహించారు. ఈ టోర్నమెంటులో విన్నర్‌గా నిలిచిన కాంత్ టీంకు, రన్నర్‌గా నిలిచిన సాయి టీంకు కళాశాల ప్రిన్సిపాల్ విజయలక్ష్మి చేతుల మీదుగా బహుమతులను ప్రదానం చేశారు. చాయ్ దునియా ఫ్రాంచెస్ మేనేజర్ బండ సుదర్శన్ విజేతలకు బహుమతులకు స్పాన్సర్ చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్‌ప్రిన్సిపాల్ ప్రభాకర్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్, అధ్యాపకులు అంజనేయులు, దర్మపురి, శ్రావన్, బిక్షమయ్య, ఆదివిష్ణు, కృష్ణప్రసాద్, సుచరన్, మనోహర్, జగన్నాథం, మహేష్, శ్రీనివాస్, రవి, శైలజ, దీపిక, భార్గవి, రమ్య తదితరులు పాల్గొన్నారు.

ఆలయ పరిసరాలను శుభ్రం చేసిన బీజేపీ నాయకులు

రుద్రంగి, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి) : రుద్రంగి మండల కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో ఆదివారం మహాలక్ష్మి అమ్మవారి ఆలయాల పరిసరాలను శుభ్రం చేశారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ పుట్టినరోజు సందర్భంగా సేవా పక్షం కార్యక్రమంలో భాగంగా ఆలయం చుట్టూ ఉన్న పిచ్చిమొక్కలను తొలగించి శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు కర్నవత్తుల వేణు, బాలకిషన్‌రావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప దీక్ష సమితి ఆధ్వర్యంలో అన్నదానం

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు21(ఆంధ్రజ్యోతి): పితృ అమావాస్యను పురస్కరించుకుని అఖిల భారత అయ్యప్ప దీక్ష సమితి మండల శాఖ ఆధ్వర్యంలో ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణంలో ఆదివారం అన్నదానం చేశారు. సమితి సభ్యుడు చింత స్రవంతి- రాజు నేతృత్వంలో సభ్యులు ప్రయాణీకులు భోజనం అందజేశారు. కార్యక్రమంలో సభ్యులు శ్రీనివాస్ గౌడ్, మధు, రాజు, శ్రీనివాస్, బాపురెడ్డి, రవీందర్, శేఖర్, రవి, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతులు


రోడ్డు మరమ్మతు పనులను పర్యవేక్షిస్తున్న నాయకులు

వేములవాడ రూరల్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి) : ఫాజుల్‌నగర్ నుంచి తుర్కాష్‌నగర్‌కు వెళ్లే రహదారికి ఆదివారం అధికారులు మరమ్మతు పనులు చేపట్టారు. తుర్కాష్‌నగర్‌కు వెళ్లే రహదారి బురదతో గుంతలమయం కావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. విషయం తెలుసుకున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ వెంటనే మరమ్మతులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. రహదారి మరమ్మతులకు 2లక్షల30 వేల రూపాయలను మంజూరుచేశారు. రహదారి మరమ్మతులను చేపట్టడంపై గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. రోడ్డు మరమ్మత్తు పనులను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వకులాభరణం శ్రీనివాస్, మాజీ ఎంపీపీ రంగు వెంకటేశం పరిశీలించారు.